
RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం



CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 240 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 26-3-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :240 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 26-3-2026 | పేజీలు : 8 | రూ: 2/-

## పైపులు తగలబడిన ఘటన వెనక

# విద్రోహ చర్య!



చిన్న నిప్పురవ్వ అంటుకుంటే ఇంత ప్రమాదం జరగదు

వరుస ఘటనల వెనక కుట్ర కోణం

ఫోరెన్సిక్ ఆధారాలతో 24 గంటల్లోగా నిగ్గుతేల్చాలి

డీజీపీ, ఇతర పోలీసు అధికారులకు సీఎం ఆదేశం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాజధాని అమరావతిలో తాజాగా పైపులు తగలబడిన ఘటన వెనక విద్రోహచర్య ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 130-140 డిగ్రీల వేడితో నిప్పు అంటిస్తే తప్ప పైపులు తగలబడవంటూ నిపుణులు చెబుతున్నారని, దీన్నిబట్టి చూస్తే చిన్న నిప్పురవ్వ అంటుకుంటే అంత ప్రమాదం జరిగే అవకాశమే లేదని పేర్కొన్నారు. 24 గంటల్లోగా ఘటనకు కారణాలు వెలికితీసి తనవద్దకు రావాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, గుంటూరు తరువాయి 2లో..

## ఎంత చెప్పినా మారరా?

సీఎం చంద్రబాబు హెచ్చరించే పరిస్థితి ఎందుకొస్తోంది

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

కొందరు ప్రజాప్రతినిధులపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని, ఎంత చెప్పినా వారిలో మార్పు రావట్లేదని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తరువాయి 2లో..

## అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

డయాగ్రిడ్ టెక్నాలజీతో అద్భుత నిర్మాణం: నారాయణ



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులందరూ ఒకే చోట కొలువుదీరేలా నిర్మిస్తున్న ఐదు ఐకానిక్ టవర్ల పనులు వేగవంతమయ్యాయి. ఈరోజు హెచ్ఓడీ టవర్-3 వద్ద తరువాయి 2లో..

# ఇది తెదేపా 3.0 వెర్షన్

*మధ్యవర్తులు ఉండరు: మంత్రి నారా లోకేశ్*

*క్షేత్రస్థాయిలో పనిచేసే వారికే గుర్తింపు*

*ఈ పార్టీ నాయకుల కార్ఖానా*

*పార్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లతో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ 'కాఫీ కబుర్లు'*



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

"ఇది తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్. పార్టీలో సమూల మార్పులు తీసుకువచ్చి, మరింత బలంగా ముందుకు వెళతాం" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను మధ్యవర్తులు లేకుండా నేరుగా గుర్తించడమే తమ లక్ష్యమని ఆయన ప్రకటించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జ్‌ల కోసం ఏర్పాటు చేసిన శిక్షణా తరువాయి 2లో..

## ఈసీని నడిపిస్తోంది ఎవరో తెలిసిపోయింది

బెంగాల్ సీఎం మమత



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భాజపా, కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో తరువాయి 2లో..




## చమురు నౌకలకు మన నేవీ భద్రత ఇలా..!

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియా యుద్ధ మేఘాలను దాటి కొన్ని చమురు, గ్యాస్ నౌకలు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. దేశీయ ఇంధన ప్రయోజనాలను కాపాడటంలో భాగంగా ఈ నౌకల భద్రత కోసం భారత నేవీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. 'ఆపరేషన్ ఊర్జా సురక్షా'ను ప్రారంభించి.. చమురు/ఎల్పీజీ నౌకలను సురక్షితంగా హార్మూజ్‌ను దాటిస్తోంది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను కొన్ని ఆంగ్ల పత్రికలు ప్రచురించాయి.

**హార్మూజ్ వద్దకు యుద్ధ నౌకలు..**

సాధారణంగా భారత్ వచ్చే చమురు/గ్యాస్ నౌకలు సౌదీ అరేబియాలోని రాస్ తనురా వంటి పోర్టుల నుంచి ప్రయాణం ప్రారంభిస్తాయి. ఇవి పర్షియన్ గల్ఫ్ మీదుగా హార్మూజ్ జలసంధి వద్దకు చేరుకుంటాయి. నౌక వేగం, ప్రయాణించే మార్గాన్ని బట్టి ఇందుకు గరిష్ఠంగా రెండు రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ జలసంధి వద్దే వందలాది నౌకలు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో వాటిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు భారత నౌకాదళం రంగంలోకి దిగింది. ఇరాన్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవడంతో పాటు నౌకలు జలసంధి దాటేవరకు అనుక్షణం వాటికి సహాయసహకారాలు అందిస్తోంది. హార్మూజ్ దాటిన తర్వాత ఈ నౌకలు గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోకి ప్రవేశించి అక్కడినుంచి అరేబియా సముద్రంలోకి వస్తాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల వద్ద భారత నేవీ 5 యుద్ధ నౌకలను మోహరించింది. ఈ యుద్ధ నౌకల సహకారంతోనే ఇటీవల రెండు గ్యాస్ ట్యాంకర్లు పైన్ గ్యాస్, జగ్ వసంత్ అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించి భారత్ దిశగా పయనిస్తున్నాయి. అంతకుముందు శివాలిక్, నందాదేవి వంటి గ్యాస్ నౌకలు కూడా ఈ ఆపరేషన్‌లో భాగంగానే దేశీయ పోర్టులకు చేరుకోగలిగాయి. ప్రస్తుతం ఇక్కడ భారత్‌కు రావాల్సిన 22 నౌకలు తరలింపునకు సిద్ధంగా ఉన్నాయి. వీటిల్లో 20 వరకు ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ, క్రూడ్ ఆయిల్ రవాణా తరువాయి 2లో..

# ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి

## ఇరాన్‌కు ట్రంప్ 15 కండీషన్స్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్‌తో అమెరికా ముమ్మరంగా చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగానే కాల్పుల విరమణ కోసం 15 పాయింట్లతో కూడిన ప్రణాళికను అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు పంపినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పశ్చిమాసియాకు అదనపు బలగాలను పంపించేందుకు అమెరికా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ శాంతి ప్రణాళికను పాకిస్థాన్ ప్రతినిధుల ద్వారా అమెరికా ఇరాన్‌కు పంపించినట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ కథనం రాసింది. ఈ సీజ్ ఫైర్ ప్లాన్ గురించి ఇజ్రాయెల్‌కు అగ్రరాజ్యం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే, ఈ కథనాలపై వైట్‌హౌస్ నుంచి స్పందన రాలేదు. యుద్ధం ముగింపు కోసం ఈ ప్రణాళికలో టెహ్రాన్‌కు కొన్ని షరతులు విధించింది. అవేంటంటే.. ఇరాన్ తనకున్న అణుసామర్థ్యాలను తప్పనిసరిగా నిర్వీర్యం చేయాలి. నతాంజ్, ఇస్ఫహాన్, ఫోర్డో అణు కేంద్రాలను ధ్వంసం తరువాయి 2లో..

# యుద్ధం కంచంలోకి వస్తుంది..

## ప్రపంచ వాణిజ్య సంస్థ హెచ్చరిక

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇరాన్ యుద్ధం వల్ల ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలను ఎదుర్కొంటున్నాయి. మరోవైపు హార్మూజ్‌ను మూసివేయడంతో చమురు, గ్యాస్‌తో పాటు ఎరువుల రవాణాకూ ఆటంకం ఏర్పడుతోందని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జేన్ మేరీ పౌగమ్ పేర్కొన్నారు. యూరియా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతుండడంతో.. ఎరువుల కొరత, అధిక



ధరల రూపంలో ప్రపంచ ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశముందని హెచ్చరించారు. ఐక్యరాజ్యసమితి వాణిజ్య, అభివృద్ధి విభాగం వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రపంచంలోని మూడింట ఒక వంతు ఎరువులు గల్ఫ్ దేశాల నుంచి హార్మూజ్ జలసంధి మీదుగానే రవాణా అవుతాయి. దీని మూసివేత కొనసాగితే.. యూరియా దిగుమతి చేసుకునే వ్యవసాయ ఆధారిత దేశాల్లో నిల్వలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. యుద్ధం మొదలై తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### ఏపీలో లోకల్ పండగ... భారీగా పెరుగుతోన్న సీట్లు...!

రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు పెరగనున్నాయన్న వార్తల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ భారీ ఎత్తున స్థానాలు పెంచాలని నిర్ణయించింది. తద్వారా.. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రజాప్రతినిధుల సంఖ్య మరింత పెరగనుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన కసరత్తును మునిసిపల్‌శాఖ చేపట్టింది. ఈ క్రమంలో అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం కూడా చేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్పొరేటర్లు.. కౌన్సిలర్ల సంఖ్య 50 శాతం వరకు పెరగనుంది. తద్వారా ఔత్సాహిక యువతకు.. రాజకీయాల్లోకి రావాలనే కొత్తవారికి కూడా భారీ ఎత్తున అవకాశం లభిస్తుంది. రాజకీయంగా చూస్తే.. ఈ పరిణామం కొత్తవారికి చాలా వరకు మేలు చేసే ప్రక్రియే. తద్వారా.. పార్టీల్లో ఉన్న ఆశావహులకు.. అదే విధంగా యువతకు మంచి అవకాశం లభించినట్టు అవుతుంది. అయితే.. ఇక్కడే మరో కీలక సమస్య కూడా ప్రస్తుతం ఉన్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కార్పొరేట ర్లకు, కౌన్సిలర్లకు ఇచ్చేవేతనాలు.. దాదాపు పదేళ్లుగా పెంచలేదు. అదేవిధంగా వారికి ఇస్తున్న అలవెన్సులు కూడా పెరగకపోవడం గమనార్హం. మరోవైపు.. సభ్యుల సంఖ్య పెరిగితే.. మునిసిపాలిటీలకు వచ్చే ఆదాయం పెరగదు. పైగా ఖర్చులు పెరుగుతాయి. సభ్యుల జీత భత్యాలు.. వారి అలవెన్సులతో పాటు.. కార్పొరేషన్లు, మునిసిపాలిటీల కార్యకలాపాలు పుంజుకుంటాయి. వీటిని తట్టుకునేందుకు అంతిమంగా.. ఇటు ప్రభుత్వంపైనా.. అటు ప్రజలపైనా ఆయా సంస్థలు ఆధార పడాల్సి ఉంటుంది. ఇప్పటికే పన్నులు సరిగా చెల్లించకపోవడం మునిసిపాలిటీల్లో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక, కార్పొరేషన్ల పరిస్థితి కూడా అలానే ఉంది. ఈ క్రమంలో వార్డులు, కౌన్సిళ్లు పెంచిన ప్పటికీ.. కొత్త ఆదాయ మార్గాలను పెంచకుండా.. ఆయా సంస్థలను ముందుకు నడిపించే పరిస్థితి అయితే ఉండదు. ముందుగా ఈ సమస్యలకు పరిష్కారం చూపిస్తే.. తర్వాత.. ఎన్ని స్థానాలు పెంచుకున్నా అభ్యంతరం ఉండదని పరిశీలకులు చెబుతున్నారు.

## ఇది తెదేపా 3.0 వెర్షన్



తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమంలో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీని ఒక యూనివర్సిటీతో పోల్చిన లోకేశ్, ఎంతోమంది గొప్ప నాయకులను తయారుచేసిన కార్ఖానా అని అభివర్ణించారు. "తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రెండో ముఖ్యమంత్రి కూడా మన తెలుగుదేశం యూనివర్సిటీ నుంచి వచ్చినవారే. గతంలో గండిపేటలో నిరంతరం శిక్షణా తరగతులు జరిగేవి. వాటి ద్వారా ఎంతోమంది ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలుగా ఎదిగారు. ఇప్పుడు ఏడాదికి కనీసం 300 రోజులు శిక్షణా తరగతులు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు. పదవులు ఇస్తున్నప్పటికీ, వారి బాధ్యతలేమిటో స్పష్టంగా చెప్పలేకపోతున్నామని, ఈ శిక్షణ ద్వారా ఆ లోటును భర్తీ చేస్తామని తెలిపారు.

**అహంకారం వద్దు.. ప్రజలు గమనిస్తున్నారు**

2024 ఎన్నికల్లో కూటమి సాధించిన చారిత్రక విజయాన్ని లోకేశ్ గుర్తుచేశారు. "2019 నుంచి 2024 మధ్య మనపై ఎన్నో దాడులు జరిగాయి. అక్రమ కేసులు బనాయించారు. దేవాలయం లాంటి పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. చంద్రబాబు గారిని 53 రోజులు అన్యాయంగా జైల్లో నిర్బంధించారు. వీటన్నిటిపై ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది. ఆ ఉద్యమ స్ఫూర్తితోనే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 94 శాతం సీట్లు గెలిచాం. వైసీపీ అహంకారం వల్లే 11 సీట్లకు పరిమితమైంది. మనం ఆ తప్పు చేయకూడదు. నాకు రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీ వచ్చిందని అహంకారానికి పోను. ఇది నాపై బాధ్యతను పెంచింది. ప్రజలు అహంకారాన్ని సహించరని అందరూ గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు.

**పార్టీలో సరికొత్త సంస్కరణలు**

పార్టీలో అంతర్గత సంస్కరణలపై లోకేశ్ కీలక ప్రకటనలు చేశారు. "పార్టీలో ఒకే వ్యక్తి ఒకే పదవిలో మూడుసార్లు కంటే ఎక్కువగా ఉండకూడదు. క్లస్టర్ ఇంఛార్జ్ స్థాయి నుంచి పొలిట్ బ్యూరో వరకు ఎదిగేలా మార్పులు తీసుకురావాలి. గ్రామ పార్టీ అధ్యక్షుడు కూడా పొలిట్ బ్యూరోలో కూర్చోవాలి. ఈ మార్పుల కోసం నేను నాలుగేళ్లుగా పోరాడుతున్నా. జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఇది నాకు నాలుగోసారి. ఈసారి ఆ బాధ్యత వద్దని, వేరేవారికి అవకాశం ఇవ్వాలని చంద్రబాబు గారిని కోరాను" అని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుతూ 'మై టీడీపీ' యాప్ ద్వారా కార్యకర్తల పనితీరును నేరుగా గుర్తిస్తామని చెప్పారు. "ఇకపై మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. పనిచేసేవారికీ, చేయనివారికీ తేడా స్పష్టంగా తెలుస్తుంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవం నాడు రాష్ట్రంలో ఉత్తమ పనితీరు కనబరిచిన 19 మంది కార్యకర్తలను చంద్రబాబు గారితో పాటు వేదికపై కూర్చోబెడతాం. కార్యకర్తే అధినేత అనేది మా నినాదం" అని లోకేశ్ ఉద్ఘాటించారు.

పార్టీయే సొంతిల్లు.. ప్రభుత్వ బాధ్యతలు కిరాయి ఇల్లు

తాను వారంలో ఒకరోజు తప్పనిసరిగా పార్టీ కార్యాలయానికి సమయం కేటాయిస్తున్నానని, పార్టీకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని లోకేశ్ స్పష్టం చేశారు. "తెలుగుదేశం పార్టీ మన సొంతిల్లు, ప్రభుత్వం కిరాయి ఇల్లు లాంటిది. మనమంతా కలిసికట్టుగా పనిచేస్తే 175 స్థానాల్లో విజయం సాధించవచ్చు. నాకు 91 వేల మెజార్టీ వచ్చినా, కొన్ని బూత్‌లలో వెనుకబడ్డాం. వాటిపై ఇప్పటినుంచే దృష్టి సారించాను. బలహీనంగా ఉన్న బూత్‌లను బలోపేతం చేసే బాధ్యత క్లస్టర్ ఇంఛార్జ్‌లు తీసుకోవాలి" అని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో జరిగిన దాడులను మర్చిపోవద్దని, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్, అమర్ నాథ్ గౌడ్, తోట చంద్రయ్య వంటి వారిపై జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని సూచించారు.

## పైపులు తగలబడిన ఘటన వెనక విద్రోహ చర్య!

ఎస్పీ వకుల్ జిందాల్‌ను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అమరావతి ప్రాంతంలో ఇలాగే మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయని.. వాటన్నింటినీ లింక్ చేసి దర్యాప్తుచేస్తే వాస్తవాలు బయటకు వస్తాయని, ఆ కోణంలో ముందుకెళ్లాలని సూచించారు. రాయపూడిలో హెచ్‌ఓడీ టవర్లు నిర్మిస్తున్న సంస్థ పైపులు సోమవారం అర్ధరాత్రి దగ్ధమైన ఘటనపై డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, నిఘా విభాగాధిపతి మహేష్‌చంద్ర లడ్డా, గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్‌లతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్షించారు. ఘటనపై అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక సమర్పించారు.

**ఫోరెన్సిక్ ఆధారాలతో నిగ్గు తేల్చాలి**

సీఎం మాట్లాడుతూ.. మంటలు వేగంగా వ్యాప్తి చెందడానికి కారణాలేంటని ప్రశ్నించారు. ఫోరెన్సిక్ ఆధారాల ద్వారా నిగ్గుతేల్చాలని సూచించారు. 'కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజధానిలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి తీరు చూస్తే కుట్రకోణం ఉన్నట్లు అనిపిస్తోంది. గతంలో జరిగిన కొన్ని ఘటనలు, ఇప్పుడు రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కుట్రకోణాన్ని విశ్లేషించి వాస్తవాలు బయటకు తీయాలి' అని ఆదేశించారు. అలజడి సృష్టించాలని ఎవరైనా ప్రయత్నిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

**సామగ్రి నిల్వ చేసుకునే యార్డుల్లో సీసీ కెమెరాలు**

"రాజధాని నిర్మాణపనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.కోట్ల విలువైన సామగ్రిని నిల్వచేసి పెట్టారు. ఇలాంటి ఘటనల వల్ల అనవసరమైన అడ్డంకులు ఏర్పడతాయి. నిర్మాణపనులు జరుగుతున్న ప్రదేశాల్లో అదనపు గస్తీ నిర్వహించాలి. ప్రతి నిర్మాణ సంస్థ యార్డుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. భద్రతా సిబ్బందిని పెట్టుకోవాలి. డ్రోన్ కెమెరాల ద్వారా ఆయా ప్రాంతాల్లో భద్రతను పర్యవేక్షించాలి. అనుమానితుల కదలికలపై నిఘాపెట్టాలి. వారి రాకపోకలు గమనించాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

## ఆ 450 కిలోల యురేనియం ఇచ్చేయాలి

చేయాలి. అణ్వాయుధాలు ఎప్పటికీ సమకూర్చుకోబోమని ఇరాన్ హామీ ఇవ్వాలి. ఇరాన్ భూభాగంపై అణుశుద్ధి జరగకూడదు ఇరాన్ తన వద్ద నిల్వ ఉంచుకున్న 450 కిలోల యురేనియంను ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి అప్పగించాలి. హర్మూజ్ జలసంధిని తెరవాలి. దాన్ని ఫ్రీ మారిటైమ్ కారిడార్‌గా నిర్వహించాలి. ఇరాన్ క్షిపణి కార్యక్రమాలను పరిమితంగా చేపట్టాలి. వాటి రేంజ్, సంఖ్యను తగ్గించుకోవాలి. ఆత్మరక్షణ కోసం క్షిపణులను ఉపయోగించుకోవాలి.

**మరో 1000 మంది బలగాలు..**

ఈ షరతులకు అంగీకరిస్తే.. ఇరాన్‌పై అంతర్జాతీయ సమాజం విధించిన ఆంక్షల్ని పూర్తిగా ఎత్తేస్తామని అమెరికా ఈ ప్రణాళికలో హామీ ఇచ్చింది. అంతేగాక.. పౌర అణు ఇంధనశక్తిని పెంపొందించుకొనే కార్యక్రమాలకు సాయం అందిస్తామని తెలిపింది. అయితే, ఓవైపు శాంతి ప్రణాళికను ఆఫర్ చేస్తూ పశ్చిమాసియాకు అగ్రరాజ్యం బలగాలను పంపించేందుకు సిద్ధమైంది. మరో 1000 మంది సైన్యంతో పాటు రెండు మెరైన్ యూనిట్లను ఈ ప్రాంతంలో మోహరించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తోంది.

**ఓటమిని ఒప్పందం అనొద్దు: ఇరాన్**

కాగా.. ఈ సీజ్‌ఫైర్ ప్లాన్‌పై ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పందిస్తూ అమెరికాపై విమర్శలు గుప్పించారు. "మీ ఓటమిని శాంతి ఒప్పందంగా పిలవొద్దు. ఈ ప్రాంతంలో మీ పెట్టుబడులను మేం అంగీకరించబోం" అని ఐఆర్‌జీసీ అధికార ప్రతినిధి స్పష్టంచేశారు. యుద్ధం ముగింపుపై అమెరికాతో చర్చల వార్తలను కూడా ఖండించారు.

## యుద్ధం కంచంలోకి వస్తుంది..

కొన్ని వారాలు మాత్రమే అవుతున్నందున ప్రస్తుతం ఎరువుల కొరత అంతగా లేనప్పటికీ ఈ ప్రభావం వచ్చే ఏడాది పంటలపై పడనుంది. అలా అని ప్రపంచ దేశాలు ఎరువులు, ఆహార ధాన్యాల నిల్వలు పెంచుకోవడం ప్రారంభిస్తే అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలుగుతుంది. దీనివల్ల ఆహారాన్ని దిగుమతి చేసుకునే పేద దేశాలు దయనీయ పరిస్థితులను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ (రాచీ+)ని భారత్ కొన్నేళ్లుగా ఖతార్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం ఆ దేశం నుంచి ఎల్ఎన్‌జీ సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రధాన ఆహార ఎగుమతిదారులైన భారత్, థాయ్‌లాండ్, బ్రెజిల్ వంటి దేశాలలోని కొన్ని యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి.

**ఎరువుల ధరల పెరుగుదల**

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు సుమారు 25 శాతం పెరిగాయి. సరఫరా కొరత కారణంగా ఇతర ఎరువుల ధరలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఎరువులను ఎక్కువగా వినియోగించుకునే మార్కెట్లలో భారత్, బ్రెజిల్ వంటి దేశాలు ఉన్నాయి. దీంతో ఆయా దేశాలపై అధిక ప్రభావం పడే అవకాశం ఉంది. అమెరికా కూడా యూరియాకు అతిపెద్ద మార్కెట్‌గా ఉన్నప్పటికీ నత్రజనిలో సగానికి పైగా దేశీయంగానే ఉత్పత్తి చేసుకుంటుండడం వల్ల ఆ దేశంపై ఎక్కువ ప్రభావం ఉండదు.

**ఆహార ధరలు..**

ప్రపంచ మార్కెట్లో కొరత కారణంగా ఎరువుల ధరలు పెరగడంతో రైతుల ఉత్పత్తి ఖర్చులు పెరగనున్నాయి. చమురు ధరల పెరుగుదల వల్ల రైతుల రవాణా ఖర్చులపై కూడా ప్రభావం పడుతుంది. దీంతో ప్రపంచ దేశాల్లో ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పెరగనున్నాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఆహార ధరలు సుమారు 2శాతం పెరిగే అవకాశం ఉంది.

## అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభం



**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, మర్చి 25**

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ 240 డివిజన్‌లో స్థానిక నాయకుడు అట్టేపల్లి రామప్రభు మియాపూర్ ప్రజల ఆరోగ్యరీత్యా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్‌ను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్థానిక ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సాయం త్వరితగతిన అందాలనే ఉద్దేశంతో ఈ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచం అన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఈ ఏర్పాట్లు చేసిన రామప్రభును ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదర్ నగర్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, శేరిలింగంపల్లి కాంగ్రెస్ కోఆర్డినేటర్ రఘునాథ్ రెడ్డి, అట్టేపల్లి పురుషోత్తం శర్మ, సమ్మెట ప్రసాద్, డాక్టర్ రవికుమార్ చౌదరి, నరసింహారెడ్డి, రాజేంద్రప్రసాద్ స్వామి ఆంజనేయులు ప్రసాద్ నాయుడు, ఏ ఆర్ పి టీం సభ్యులు కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### ఎంత చెప్పినా మారరా?

అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోపణలపై సీఎం చంద్రబాబు హెచ్చరించే వరకు పరిస్థితిని ఎందుకు తెచ్చుకుంటున్నారని నిలదీశారు. మంగళవారం విజయవాడలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ, ఎమ్మెల్సీలతో సమావేశం సందర్భంగా పలువురి తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొందరు ఎమ్మెల్యేలు పరిశ్రమల్లో జరిగే ప్రమాదాల్ని బూచిగా చూపి బెదిరిస్తున్నారు. ప్రజాప్రతినిధులు వసూళు చేస్తున్నారని పరిశ్రమల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రానికి పరిశ్రమలు తేవడానికి ఎంతో కష్టపడుతున్నాం. మిమ్మల్ని నమ్మి టికెట్లు ఇచ్చాం. ఇలా చేస్తే పార్టీ గౌరవానికి భంగం కలిగించిన వారవుతారు' అని స్పష్టం చేశారు.

**సభ్యత్వంలో ఎందుకు వెనకబడుతున్నారు?**

కొందరు ప్రజాప్రతినిధులు పార్టీ సభ్యత్వంలో వెనకబడటంపై పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. 'ఎందుకు చేయలేకపోతున్నారు? ఎన్నికల్లో ఎక్కువ టికెట్లు అడగాలంటే సభ్యత్వం మరింత పెరగాలి. సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి' అని సూచించారు.

### ఈసీని నడిపిస్తోంది ఎవరో తెలిసిపోయింది

విరుచుకుపడ్డారు. కేరళలో ఈసీ అధికారిక పత్రంపై భాజపా రబ్బరు స్టాంప్ కనిపించడంపై మండిపడ్డారు. తెరవెనుక ఉండి ఈసీని ఎవరు నడిపిస్తున్నారో ఇప్పుడు ప్రజలకు అర్థమైందని తెలిపారు. మంగళవారం కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఈసీ పత్రంపై భాజపా రబ్బరు స్టాంపు కనిపించడంతో సోమవారం ఈ వివాదం మొదలైంది. దీన్ని ఎన్నికల సంఘం 'మానవ తప్పిదం'గా స్పష్టంచేసింది. ఈ విషయాన్ని కేవలం మానవతప్పిదంగా కొట్టిపారేయలేమని, ఇది రాజకీయ కుట్రతో చేసిన పనిగానే కనిపిస్తోందని మమత ఆరోపించారు. ఈ పరిణామం.. దేశంలో ఏకపక్షపాలనను రుద్దడానికి ఈసీ మద్దతిస్తున్నట్లుగా ఉందన్నారు. దీనిపై అన్నిపార్టీలు ఏకమై ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని మమత పిలుపునిచ్చారు.

### అమరావతి 'ఐకానిక్' టవర్లు రెడీ అవుతున్నాయి..

'కార్నర్ నోడ్' అమర్చే పనులను మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అత్యాధునిక డయాగ్రిడ్ సాంకేతికతతో ఈ భవనాలను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అమరావతి నిర్మాణానికి ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు రూపొందించిన ప్రత్యేక ఫైనాన్స్ మోడల్ ద్వారానే ఈ నిధులు సమకూరుతున్నాయని, అమరావతి ఒక 'సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ' అని ఆయన గుర్తు చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల వల్ల సుమారు 4 నెలల పాటు పనులకు అంతరాయం కలిగిందని, ఇప్పుడు పనుల వేగాన్ని పెంచామని తెలిపారు. ఐకానిక్ భవనాలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారుల నివాస సముదాయాల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయని వివరించారు. రాయపూడి వద్ద జరిగిన అగ్నిప్రమాదంపై సీఎం ఇప్పటికే సమీక్షించారని, ఒకవేళ ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ ప్రమాదానికి పాల్పడి ఉంటే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ప్రస్తుతం దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు.

**డయాగ్రిడ్ టెక్నాలజీ అంటే ఏమిటి?**

ఈ టవర్ల నిర్మాణంలో వాడుతున్న డయాగ్రిడ్ టెక్నాలజీ వల్ల భవనానికి లోపల పిల్లర్లు ఉండాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. దీనివల్ల లోపల స్థలం ఎక్కువగా లభిస్తుంది. ఉక్కును త్రిభుజాకారపు గ్రిడ్లుగా అమర్చడం వల్ల భవనానికి అద్భుతమైన పటుత్వంతో పాటు ఒక ఆధునిక లుక్ వస్తుంది.

### ఆపరేషన్ 'ఊర్జా సురక్షా'..

చేస్తున్నవే..!

**సేఫ్ రూట్‌ను చెబుతూ..**

సాధారణంగా సముద్రంలో ప్రయాణం హైడ్రోగ్రాఫిక్ చార్ట్‌లు, నావిగేషన్ వ్యవస్థల ఆధారంగా ఉంటుంది. ప్రస్తుతం ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సీమైన్స్‌ను అమర్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వీటిల్లో చాలావరకు బయటకు కన్పించవు. వీటి కారణంగా నౌకలకు తీవ్ర ముప్పు పొంచి ఉంటుంది. అందుకే, ఈ సీమైన్స్ తగలకుండా నౌకలను హర్మూజ్‌ను దాటించడం అత్యంత ఆవశ్యకం. దీన్ని గుర్తించిన భారత నేవీ.. మన నౌకల కోసం ప్రత్యేక హైడ్రోగ్రాఫిక్ చార్ట్‌లను రూపొందిస్తోంది. నిఘా నౌకలతో సముద్ర గర్భాన్ని స్కాన్ చేసి నావిగేషన్ రూట్స్‌ను గుర్తిస్తోంది. ఆయా మార్గాలను నౌకలకు ఎప్పటికప్పుడు అందిస్తూ వాటిని హర్మూజ్ నుంచి తీసుకొస్తోంది.

**హర్మూజ్‌లో ఛార్జీలపై గందరగోళం..**

ఇదిలాఉండగా.. హర్మూజ్ జలసంధిని దాటే నౌకలకు ఛార్జీలు విధిస్తామని ఇరాన్ చెప్పినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అవన్నీ అవాస్తవమని భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది. అయితే, దీనిపై తాజాగా ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి చేసిన వ్యాఖ్యలు గందరగోళం సృష్టిస్తున్నాయి. హర్మూజ్‌లో నౌకల సురక్షిత ప్రయాణానికి ఫీజులు వసూలు చేస్తామని ఓ మీడియా ఇంటర్వ్యూలో ఆయన చెప్పడం గమనార్హం. మరోవైపు, అమెరికా-ఇజ్రాయెల్ సంబంధిత నౌకలు మినహా మిగిలినవన్నీ హర్మూజ్ మీదుగా ప్రయాణించవచ్చని ఐరాస సమావేశంలో ఇరాన్ ప్రకటన చేసింది.

## ఈ నెల 28 రాత్రి 8-30 నుండి 9-30 వరకు విద్యుత్ లైట్స్ ఆఫ్ చేయండి

### "ఎర్త్ అవర్ కు మద్దతు ఇవ్వండి"

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ మార్చి 25**

ఈ నెల 28వ తేది (శనివారం) రాత్రి 8-30 నుండి 9-30 గంటలు వరకు అవసరం లేని విద్యుత్ లైట్ లను ఆఫ్ చేసి "ఎర్త్ అవర్ కు" ప్రజలు, సంస్థలు మద్దతు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ప్రకృతి పరిరక్షణ కోసం వరల్డ్ వైడ్ ఫండ్ ఇండియా ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని, 2007 నుండి ప్రారంభమైన ఈ ఉద్యమం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా అమలు జరుగుతున్నదన్నారు. 28వ తేది రాత్రి ఒక గంట పాటు అత్యవసరం కాని లైట్లను ఆఫ్ చేసే ప్రజలలో అవగాహన కల్పించేలా సందేశాలు ఇవ్వాలని, ఇందుకు గాను ప్రజలు, సంస్థలు, అధికారుల ముందుకు రావాలని వరల్డ్ వైడ్ ఫండ్ ఇండియా కోరిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కలక్టర్ కోరారు.

## కలెక్టర్ కి వినతి పత్రం అందించిన బొందిలీ కుల తోలుబొమ్మలాట వృత్తి కళాకారులు




**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 25**

ఆంధ్రప్రదేశ్ బొందిలీ కుల తోలుబొమ్మ లాట వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర కమిటీ బుధవారం కాకినాడ లో సమావేశమైంది. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలిని మర్యాద పూర్వకంగా కలిశారు.తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు.రాష్ట్రంలో ఉన్న ప్రతి కళాకారుడికి జిల్లాస్థాయిలోకానీ ,రాష్ట్రస్థాయిలో కానీ గుర్తింపు కార్డును జారీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలలో అవగాహన కల్పించుటకు కళాకారులకు నెలకు 15 రోజులు పని దినాలు కల్పించాలని, ఇల్లు లేని పేద కళాకారులకు ఇల్లు మరియు ఇళ్ల స్థలాలు కల్పించాలని, 50 సంవత్సరాల నిండిన ప్రతి కళాకారులకు గౌరవ వేతనం కింద నెలకు రూ.10వేలు అందించాలని, ఆంధ్రప్రదేశ్ బొందిలీ కుల తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య సంఘానికి కాకినాడ రూరల్ పరిసర ప్రాంతాల్లో 500 గజాల స్థలం కేటాయించాలని, రాష్ట్రంలో ఉన్న తోలుబొమ్మలాట వృత్తి కళాకారులకు పనిముట్లు కొరకు ప్రభుత్వం ద్వారా రుణ సౌకర్యం కల్పించేలా , పెండింగ్ లో ఉన్న కళాకారుల పాత బకాయిలు వెంటనే విడుదల చేసేందుకు తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బొందిలీ కుల తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తోట పవన్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనపర్తి కోటేశ్వరరావు,రాష్ట్ర,జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మాజీగూడెం సీఐ ఎరువుల వ్యాపారతో కీలక సూచనలు

**లింగపాలెం (సిటిజెన్ టైమ్స్) మార్చి 25**

ధర్మాజీ గూడెం ఎరువుల వ్యాపారులతో సీఐ క్రాంతి కుమార్ ఎస్సై వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో సిఐ క్రాంతి కుమార్ మాట్లాడుతూ మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎరువులు విక్రయించరాదని స్పష్టం చేశారు ప్రభుత్వం నిషేధించిన రసాయన పురుగుమందులను నిల్వ ఉంచిన అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు అలాగే వ్యాపారస్తులు ఎటువంటి డిపాజిట్లను సేకరించరాదని సూచించారు.



# నార్త్ ,వెస్ట్ జోన్ ప్రాంతాల్లో పర్యటించిన జీవీఎంసీ కమిషనర్

### దోమల నియంత్రణ చర్యలు పారిశుధ్య పనులతో సంయుక్తంగా చేపట్టండి.

### పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలను స్థానికులను అడిగి తెలుసుకున్న కమిషనర్.

### ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులు ప్రణాళికాయుక్తంగా చేపట్టి, రోడ్డు విభాగినిలలో పచ్చదనాన్ని అభివృద్ధి పరచండి.

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 25:**

పారిశుధ్య నిర్వహణ పనులలో లోపాలను సవరించి, దోమల నియంత్రణ చర్యలు పారిశుధ్య పనులతో కలిపి జరపాలని ప్రజారోగ్య అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ నార్త్ జోన్ లో 55 ,46 వార్డులు ,వెస్ట్ జోన్ లో 56 వ వార్డులో పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులు, ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులు,కాలువల అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్లు బి. హేమవతి, బి.రాము, పర్యవేక్షక ఇంజనీర్ పద్మావతి లతో కలిసి పరిశీలించారు. కమిషనర్ ముందుగా 56 వ వార్డు లో గోకుల్ నగర్ ఊర్వశి జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ నిత్యం జరుగుచున్న పారిశుధ్య పనులు పై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాల సేకరణలో సంబంధిత వాహనాలు ప్రణాళికాయుతంగా సేకరణ తరలింపు ప్రక్రియ జరపాలని, వ్యర్థాల సేకరణ, వీధులు,రోడ్లు, కాలువల పరిశుభ్రతలో లోపాలు లేకుండా నిర్ణీత సమయానికే పారిశుధ్య పనులు పూర్తయ్యేలా కార్యచరణ చేపట్టాలని శానిటేషన్ కార్యదర్శులకు ఆదేశించారు. దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్న మలేరియా విభాగం సిబ్బందితో మాట్లాడుతూ వారి విధివిధానాలను ఆరా తీసి , నిత్యం పారిశుధ్య పనులు జరుగుచున్న సమయంలోనే దోమల నియంత్రణ కు సంబంధించిన ఫాగింగ్ ,స్ప్రేయింగ్, ఇంటింటి పరిసరాల పరిశీలన , ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా మలేరియా విభాగం సిబ్బందికి, కార్యదర్శులకు దిశా నిర్దేశం చేయాలని



, మలేరియా డెంగ్యూ వ్యాధులను నివారించేందుకు,దోమల వృత్తిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జోనల్ కమిషనర్ బి.హేమావతికి కమిషనర్ ఆదేశించారు. అనంతరం నార్త్ జోన్ 55 వార్డులో తాటి చెట్ల పాలెం జంక్షన్ నుండి కంచరపాలెం వరకు ప్రతిపాదిత రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి , రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రణాళిక యుక్తంగా పనులను చేపట్టాలని, ఇప్పటికే ఆ మార్గంలో నున్న రోడ్డు విభాగినిలో పచ్చదనాన్ని పెంపొందించి అందంగా తీర్చిదిద్దాలని పర్యవేక్షక ఇంజనీరు పద్మావతికి పలు



సూచనలు చేశారు. అనంతరం 46 వ వార్డు కైలాసపురం ప్రాంతంలో మధుసూదన్ నగర్ నుండి కస్తూరి నగర్ మీదుగా పూర్తిచేసిన గెడ్డ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ భరణి, సానిటరీ ఇన్స్పెక్టర్ లు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత

### - అడవిలో విహరిస్తూ జీవవైవిధ్యం గురించి తెలుసుకోవాలి

### - ఏ జీవి అంతరించినా నష్టం మానవాళికే

### - శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి

### - జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 25:**

జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి విద్యార్థి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. బుధవారం ఉదయం కర్నూలు జిల్లా కేంద్రంలోని నగర వనంలో నేషనల్ గ్రీన్ కోర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం జిల్లా సమన్వయ కర్త ఆకుల రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం పీల్చే గాలిలో రెండు శ్వాసల్లో ఆక్సిజన్ లేకుంటే మృత్యువాత పడుతున్నారు. అందుకే మనం అంతా చెట్లు పెంచాలని, ప్రకృతి వనరులను కాపాడుకోవాలి అన్నారు. అందుకే ప్రకృతి కార్యశాలలు నిర్వహించాలని కోరారు. అడవిలో విహరిస్తూ జీవవైవిధ్యం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది అన్నారు. భూమి మీద ఏ జీవి అంతరించినా నష్టం మానవాళికే అని వివరించారు. శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేయాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా సమన్వయ కర్త ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ ప్రకృతి కార్యశాలల అవసరం ఎంతైనా ఉంది అన్నారు. విద్యార్థులకు ప్రకృతి వనరుల పరిరక్షణ ఆవశ్యకత అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు. నగరవనం లో ఉన్న పక్షులు, వాటి కిల కిలా రావాలు విద్యార్థులను బాగా ఆకట్టుకున్నాయి న్నారు. అలాగే బియ్యం పిండి తో ముగ్గులు వేయించడం, ఆ ముగ్గు వేసిన పిండిని చీమలు తీసుకుని వెళ్ళడం, విభిన్న జీవుల మాస్క్ లతో విద్యార్థుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ రత్నం పక్షులు, ఇతర జీవులకు, నీరు, ఆహారం పెట్టె పాత్రలూ, గూళ్ళను తయారు చేయడం మీద అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని విభిన్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కె వీరేష్ బాబు, హైమవతి, శంకర్ , రంగస్వామి, పుల్లమ రాజు, కె భాస్కర్, మద్దిలేటి నల్లూరు , సుంకన్న, శారద, సిబి వెంకట రమణ రెడ్డి, ఎస్ . నజీమా, ఎన్ భరత్ కుమార్, జి శ్రీనివాసరెడ్డి, పి శివశంకరయ్య, సరస్వతమ్మ,, కుమార్ నాయక్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

# జిల్లాలో రెండు దశల్లో జనగణన

### కాల్లో నిబంధనలను పాటించాలి

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, (సిటిజన్ టైమ్స్ ) మార్చి 25**

జనాభా లెక్కలు రెండు దశలలో జరుగుతాయని, మొదటి దశలో బ్లాకుల వారీగా గృహాల లెక్కింపు జరుగుతుందని, రెండవ దశ లో జనాభా గణన వచ్చే ఏడాది లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి విజయ క్రిష్ణన్ తెలిపారు. బుధవారం అనకాపల్లి పట్టణం స్థానిక గుండాల జంక్షన్ ఎస్.ఆర్.శంకరాన్ ఫంక్షన్ హాల్లో డి.ఆర్వో. మరియు జిల్లా జనగణన అధికారి వై.సత్యన్నారాయణ రావు ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి శిక్షకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు గతం లో జనాభా లెక్కింపు కార్యక్రమం మాన్యువల్ గా జరిగేదని, ఈ సారి అంత ఎలెక్ట్రానిక్ విధానం లోనే జరుగుతుందని అన్నారు. మొదటి దశలో గృహాల లెక్కింపు జరుగుతుంది కావునా జనగణన కు సంబంధించి నిబంధనలను, పద్ధతులను పాటిస్తూ తప్పులు జరగకుండా చేపట్టాలని తెలిపారు. తదుపరి ఎన్యూమరే టర్లకు , సూపర్వైజర్ల కు శిక్షణ ఉంటుందని, అన్ని స్థాయిల్లో శిక్షణ సజావుగా జరగాలని అన్నారు. డి.ఆర్వో మరియు జిల్లా జనగణన అధికారి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇది 8వ జనాభా లెక్కింపు కార్యక్రమమని, బ్రిటిష్ కాలం లో మొదటగా 1881 లో జనాభా లెక్కింపు జరిగిందని తెలిపారు. కోవిడ్ కారణంగా అప్పుడు జరగాల్సినవి ఇప్పుడు జరుగుతున్నాయని, ఇక్కడ శిక్షణ పొందిన వారు క్షేత్ర స్థాయి లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమం లో కలెక్టరేట్ సమన్వయ సూపరింటెండెంట్ వి.ఎస్.వాసు నాయుడు, మాస్టర్ ట్రైనర్లు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపైకలెక్టర్ సమీక్ష



**చింతలపూడి (సిటిజన్ టైమ్స్) మార్చి 25**

చింతలపూడి నియోజకవర్గం ఎమ్మెల్యే సొంగ. రోషన్ కుమార్ అధ్యక్షతన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించిన కలెక్టర్ వెట్రిసెల్వి. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు ఎంపీక చేయాలని సూచించిన కలెక్టర్. చింతలపూడి నియోజకవర్గానికి అభివృద్ధి పనులకు తగిన నిధులు కేటాయించాలని కలెక్టర్ వెట్రిసెల్వీ కోరిన ఎమ్మెల్యే రోషన్ కుమార్. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

## యాస్.యానం గ్రామ ప్రజల ఆరోగ్యానికి 'వేదాంత-కిమ్స్' భరోసా

### - ఉచిత హెల్త్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**ఉప్పలగుప్తం/ఎస్.యానం, మార్చి26**

వైద్యం కోసం పేద కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో సేవా సంస్థల సహకారంతో అందిస్తున్న ఈ ఉచిత హెల్త్ కార్డులను యాస్.యానాం గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు కోరారు. బుధవారం ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం గ్రామంలో వేదాంత సంస్థ వారి ఆర్థిక సహాయంతో, కిమ్స్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్.యానం గ్రామ ప్రజలకు మాత్రమే ప్రత్యేకంగా కేటాయించిన 'ఆయువు భరోసా' ఉచిత హెల్త్ కార్డులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైద్యం కోసం పేద కుటుంబాలు అప్పుల పాలు కాకూడదనే ఉన్నతమైన ఆశయంతో ఈ ఉచిత హెల్త్ కార్డులను అందిస్తున్నామని, వీటి ద్వారా కార్పొరేట్ స్థాయి చికిత్సను పేదలు సైతం ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. యాస్.యానం గ్రామస్తుల ఆరోగ్య సంరక్షణ కోసం వేదాంత ,కిమ్స్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని,ఈ కార్డుల ద్వారా అత్యున్నత ప్రమాణాలతో కూడిన కార్పొరేట్ వైద్యాన్ని గ్రామ ప్రజలు ఉచితంగా పొందవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రతి పేదవాడి ఆరోగ్యానికి పూర్తి రక్షణ కల్పిస్తున్నారని, గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ముందస్తు ఆరోగ్య పరీక్షల ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేదాంత సంస్థ ప్రతినిధులు,కిమ్స్ ఆసుపత్రి వైద్య బృందం, ఎస్.యానం గ్రామ ప్రజాప్రతినిధులు మరియు మండల కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

## పాదచారుల క్రాసింగ్ వద్ద విధిగా సూచిక బోర్డులు, బ్లింకర్స్ పెట్టాలి

## రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

## స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుపై, అవసరాలపై సంయుక్త పునఃపరిశీలన చేయాలి






**విశాఖపట్టణం, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులంతా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీతో కలిసి బుధవారం సాయంత్రం కలెక్టర్ మీటింగు హాలులో ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో భాగంగా ముందుగా డిప్యూటీ ట్రాన్స్ పోర్టు కమిషనర్ ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు గత రెండు సంవత్సరాలకు, ఈ ఏడాదికి సరిపోల్చుతూ నివేదికలను ప్రదర్శించారు. గతం కంటే ఇప్పుడు రోడ్డు ప్రమాదాలు తగ్గాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రథమంగా జిల్లాలో ఏర్పాటు చేసిన వేగ నియంత్రికల (స్పీడ్ బ్రేకర్స్)పై జీవీఎంసీ, ఆర్టీసీ, పోలీసు, రోడ్డు ట్రాన్స్ పోర్టు అధికారులు సంయుక్త పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. వాటి అవసరం ఎంత మేరకు ఉంది.. ప్రయోజనాలు, దుష్ప్రయోజనాలను బేరీజు వేయాలని సూచించారు. అవసరం లేని చోట తొలగించాలని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్ చేసే వాళ్లపై కఠినంగా ఉండాలని, నిబంధనల అమల్లో రాజీ పడొద్దని పేర్కొన్నారు. జాతీయ రహదారిలో పాదచారుల క్రాసింగ్ వద్ద విధిగా సూచిక బోర్డులు, వాహనాదారులకు కనిపించేలా బ్లింకర్స్ పెట్టాలని ఎన్.హెచ్.ఎ.ఐ. అధికారులను ఆదేశించారు. హనుమంతువాక జంక్షన్ విస్తరణ, అండర్ పాస్ నిర్మాణంపై చర్చించిన ఆయన జూ పార్కు నుంచి వచ్చే రోడ్డులో హనుమంతువాక సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్, కైలాసగిరి నుంచి ప్రయాణం చేసి హైవేకు చేరుకునే వైపు ఫ్రీ లెఫ్ట్ లను విస్తరించాలని సంబంధిత అధికారులకు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో స్పందించి, సహాయం చేసే వారికి నగదు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో చేపట్టాల్సిన రోడ్డు, జంక్షన్ల విస్తరణ పనులు, డివైడర్ల నిర్మాణం, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఎయిర్ పోర్టు నుంచి గాజువాక వైపు వెళ్లే సర్వీసు రోడ్డు విస్తరణపై జీవీఎంసీ, ఎయిర్ పోర్టు అధికారులు చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రోడ్డుకు మధ్యలో ఎలాంటి ప్రచార బోర్డులు పెట్టరాదని జీవీఎంసీ అధికారులకు చెప్పారు. షాపింగ్ కాంప్లెక్సుల్లో సెల్లార్ పార్కింగులను ప్రోత్సహించాలని, అలా కాకుండా రోడ్డుపై అడ్డదిడ్డంగా పార్కింగు చేసే వాహనదారులపై చర్యలు తీసుకోవాలని పోలీసు, జీవీఎంసీ అధికారులకు చెప్పారు. విశాఖ వ్యాలీ, పోర్టు రోడ్డులో నైట్ పెట్రోలింగ్ పెంచాలని, భవన వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేయకుండా పర్యవేక్షణ చేయాలని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా నియంత్రించాలని, అవసరమైతే కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు.

**స్పీడ్ లేజర్ గన్ లు సమకూర్చాలి.. లైసెన్సులు రద్దు చేయాలి : సీపీ**

రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు, నిబంధనలను కఠినంగా అమలు చేసేందుకు యంత్రాంగం నుంచి సహకారం కావాలని, ముఖ్యంగా స్పీడ్ లేజర్ గన్ లు కావాలని పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ కోరారు. రాత్రి పూట బైక్ రేసింగ్ లు చేసే వారిని కట్టడి చేసేందుకు అవి బాగా ఉపకరిస్తాయని పేర్కొన్నారు. అలాగే నిబంధనలు అతిక్రమించిన వారి లైసెన్స్ లు రద్దు చేసేందుకు రోడ్డు రవాణా సహకారం అందించాలని, చాలా మంది వివరాలు ఇచ్చినప్పటికీ కొంతమంది లైసెన్సులే రద్దు చేశారని గుర్తు చేశారు. మిగిలిన వాటిపై త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీసీపీ మణికంఠ చందోలు, డీటీసీ ఆర్.సి.హెచ్. శ్రీనివాసరావు, గాజువాక ఆర్టీవో సూర్యప్రకాశ్, ఆర్టీసీ ఆర్.ఎం. అప్పలనాయుడు, ఎంవీఐలు బుచ్చిరాజు, దుర్గాప్రసాద్, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి గొప్ప సంఘసంస్కర్త

### రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

### మంత్రి సుభాష్ ను ఘనంగా సత్కరించిన శెట్టిబలిజ సంఘీయులు






**తాళ్ళరేవు సిటిజన్ టైమ్స్ మార్చి 25**

శెట్టిబలిజ జాతి పితామహుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి ప్రముఖ సంఘ సంస్కర్త అని ,ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలంలో శెట్టి బలిజ జాతిపిత స్వర్గీయ దొమ్మేటి వెంకట రెడ్డి జయంతోత్సవ కార్యక్రమం తాళ్ళరేవు మండల తెలుగు దేశం పార్టీ శెట్టి బలిజ ప్రజాప్రతినిధులు, నాయకులు స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మంత్రి వాసంశెట్టి సుభాష్, ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి లు హాజరై ఏర్పాటు చేసిన స్వర్గీయ దొమ్మేటి వెంకట రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక సంఘీయులు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి రాష్ట్ర వేడుకగా నిర్వహించేందుకు కృషి చేసిన మంత్రి సుభాష్ ను ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ దొమ్మేటి వెంకట రెడ్డి జీవిత చరిత్రను గుర్తించి కూటమి ప్రభుత్వం జీఓ నెంబర్ 629 విడుదలచేసి ఆయన జయంతి రాష్ట్ర పండుగలా నిర్వహించటంపై హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు జార్జీపేట గ్రామం రెడ్డి వారి పేటలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారాముల ఆలయంను సందర్శించి స్వామి ఆశీస్సులు పొందారు.అనంతరం తాళ్ళరేవు గ్రామం కేశవపురంలో నూతన రామాలయ ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు.ఆ ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు పండితులచే పూర్ణ కుంభం తో ఘణస్వాగతం పలికి సత్కారించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కట్టా త్రిమూర్తులు, పిల్లి సత్తిబాబు, పితాని విష్ణు,వాడ్రేవు వీరబాబు, గంజా సూరిబాబు, గుత్తుల సూర్యనారాయణ, పొన్నమండ రామలక్ష్మి, మేడిశెట్టి సత్తిబాబు, జక్కల ప్రసాద్ బాబు, రోళ్ళ చక్రవర్తి, ఉంగరాల బూరిబాబు,కొప్పిశెట్టి చంటి, పెంకే ఏడుకొండలు,చోడి నరసింహ మూర్తి, రెడ్డి నాగు, కడలి సింహాద్రి, కడలి శ్రీ నివాస్, విత్తనాల కర్మిలస్వామి, సూరంపూడి కుమార్, యనమండ్ర విజయ్ కుమార్, సుందపల్లి సత్యనారాయణ,పితాని హేమలత, చంద్రాల బుజ్జి చౌదరి, టేకుమూడి సత్యనారాయణ, పిల్లి మహేష్, వాసంశెట్టి గోవిందు,పెన్నాడ వేణు, ఉమామహేశ్వరి,సత్యవేణి, దంగేటి అవినాష్, గోపాలం, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలగుప్తంలో వైభవంగా ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం

### రైతులకు ఆధునిక సాంకేతికతను అందించడమే ఆత్మ కమిటీ లక్ష్యం-ఎమ్మెల్యే ఆనందరావు



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

ఉప్పలగుప్తంలో నిర్వహించిన ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవ సభలో అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకురాలు చిక్కం సుధ ఆత్మ కమిటీ చైర్మన్‌గా, ఆమెతో పాటు 30 మంది డైరెక్టర్లు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, కూటమి ధర్మాన్ని పాటిస్తూ జనసేన పార్టీ కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపునిస్తూ ఈ పదవులను కేటాయించామని తెలిపారు. ఆత్మ కమిటీ అనేది కేవలం ఒక పదవి మాత్రమే కాదని, ఇది రైతులకు సాగులో సరికొత్త టెక్నాలజీని, హార్టికల్చర్ మరియు పశుసంవర్ధక రంగాల్లో వినూత్న పద్ధతులను పరిచయం చేసే కీలక సంస్థ అని ఆయన వివరించారు. గతంలో ఈ పదవులు నామమాత్రంగా ఉండేవని, కానీ సుధ నాయకత్వంలోని ఈ కొత్త కమిటీ క్షేత్రస్థాయిలో రైతులకు అండగా ఉంటూ పది పనులు చేసి చూపించాలని, దానికి శాసనసభ్యుడిగా తాను పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ, గత ఐదేళ్ల జగన్ మోహన్ రెడ్డి దుర్మార్గమైన పాలనలో రాష్ట్రం 9.5 లక్షల కోట్ల అప్పులతో దివాలా తీసిందని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అనుభవం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవ, లోకేష్ కృషి వల్ల ఆంధ్రప్రదేశ్ మళ్ళీ పునర్నిర్మాణం వైపు అడుగులు వేస్తోందని అన్నారు. మనం కలలు కంటున్న పోలవరం, అమరావతి వంటి ప్రాజెక్టులు పూర్తి కావాలన్నా, రాష్ట్రానికి పరిశ్రమలు రావాలన్నా కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్ల పాటు అధికారంలో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు, కులాల మధ్య చిచ్చు పెట్టడం ద్వారా రాజకీయాలు చేస్తున్నారని, కూటమి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి వారి కుతంత్రాలను తిప్పికొట్టాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలాపురం నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో ఏకపక్ష విజయాలను సాధించి ఆదర్శంగా నిలవాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చివరిగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ చిక్కం సుధ గారికి మరియు డైరెక్టర్లందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ "జై చంద్రబాబు, జై పవన్ కళ్యాణ్, జై మోదీ" నినాదాలతో ప్రసంగాన్ని ముగించారు.

# గొల్లవిల్లి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

### కల్తీ పాలను అరికట్టి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

### డ్వాక్రా మహిళల ద్వారా పాల ఉత్పత్తి సంఘాల ఏర్పాటు

### రైతులకు గిట్టుబాటు ధర అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఉప్పలగుప్తం, సిటిజన్ టైమ్స్ మార్చి 25**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలల కాలంలో ఇప్పటికే 11 ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించామని, ప్రతి రెండు నెలలకు ఒక శిబిరం చొప్పున నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో వీటిని ఏర్పాటు చేయడమే మా లక్ష్యమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.



ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.... రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాతలకు సంవత్సరానికి 20 వేల రూపాయల ఆర్థిక సాయం అందించడమే కాకుండా,సాగు యంత్రాలపై 50 నుండి 90 శాతం వరకు భారీ సబ్సిడీని కల్పిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పోలవరం ప్రాజెక్టును, అమరావతి రాజధాని నిర్మాణాన్ని చంద్రబాబు గారు మళ్ళీ పరుగులు పెట్టిస్తున్నారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు డ్వాక్రా మహిళల ద్వారా నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తద్వారా రైతులకు పాలకు గిట్టుబాటు ధర లభించడమే కాకుండా కల్తీ లేని స్వచ్ఛమైన పాలు ప్రజలకు అందుతాయని తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న కృత్రిమ, కల్తీ పాల వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్నాయని,దీనిని నివారించేందుకు ప్రతి రైతు ఆర్గానిక్ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పంజాబ్ వంటి రాష్ట్రాల్లో మితిమీరిన పెస్టిసైడ్స్ వాడకం వల్ల 'క్యాన్సర్ ట్రైన్లు' నడుస్తున్న పరిస్థితిని మనం గమనించాలని హెచ్చరించారు. ఖాళీగా ఉన్న తోటల్లో డ్వాక్రా మహిళలకు అవకాశం కల్పిస్తూ ఆర్గానిక్ కూరగాయలు పండించాలని, తద్వారా మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని సూచించారు. సొంతంగా పశువులను పెంచుకోవడానికి స్థలం లేని వారి కోసం ప్రభుత్వం 'పశువుల హాస్టల్స్' నిర్మిస్తోందని, త్వరలోనే మన మండల కేంద్రానికి కూడా ఒక పశువుల హాస్టల్ రాబోతోందని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే 'మన ఎమ్మెల్యేతో మన పోలింగ్ బూత్' అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నామని, ప్రతి గ్రామంలో అధికారులతో కలిసి ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమని వెల్లడించారు. పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా రాష్ట్ర

# అక్రమ నిర్మాణాలు సీజ్....

## ఫిర్యాదులకు స్పందించిన జిహెచ్ఎంసి అధికారులు...

## మూడు బిల్డింగుల సీజ్..

**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, మర్చి 25**

మియాపూర్ డివిజన్ లో బుధవారం రోజు 44 సర్వే నెంబర్ మక్త మహబూబ్ పేట్ లో పర్మిషన్ లేకుండా ఐదు ఫ్లోర్ బిల్డింగ్ లు కడుతున్న వారిపై ప్రజావాణిలో 16 ఫిర్యాదులు ఇవ్వగా అందులో 3 బిల్డింగులు జి హెచ్ ఎం సి అధికారులు సీజ్ చేయడాన్ని అభినందిస్తున్నాం ఇంకా 13 బిల్డింగులు కన్స్ట్రక్షన్ లో ఉన్నందున పర్మిషన్ లేకుండా కట్టే బిల్లింగ్ లను తక్షణమే సీజ్ చేయాలని వారిని కోరుతూ హైకోర్టు 44 సర్వే నెంబర్లు పై ట్రిబ్యునల్ బెంచ్ ఎలాంటి నిర్మాణాలు చేయకూడదని 2016 లో ఆర్డర్ ఉన్నప్పటికీ అక్రమ దారులు ఎలాంటి అనుమతులు



లేకుండా ఐదు ఫ్లోర్లు ఆరు ఫ్లోర్లు 100 గజాల్లో ఏడు ఫ్లోర్లు కూడా నిర్మిస్తూ నాణ్యత లేని బిల్డింగులు కడుతూ తక్కువ ధరకు అమ్మి ప్రజలను మోసం చేస్తున్నారు కాబట్టి కన్స్ట్రక్షన్ లో ఉన్న మిగతా బిల్డింగులు కూడా సీజ్ చేయవలసిందిగా కోరుతూ ఈ సందర్భంగా తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు తెలియజేశారు.



# గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల సంస్కార్ కేంద్రాలు ఏర్పాటు.



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మార్చి 25 సీజన్ టైమ్స్**

అన్నమయ్య మదనపల్లి జిల్లాలోని కలికిరి మండలం లో గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బాల సంస్కార కేంద్రాలు ఏర్పాటు చేయవలెనన్న ఉద్దేశ్యముతో తొలి దశలో భాగంగా మండలంలోని గుట్టపాలెశీ, అండే కురవపల్లి, మేడికుర్తి పంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సందర్భంగా ఫౌండేషన్ కలికిరి మండల ప్రత్యేక అధికారి రమేష్ మాట్లాడుతూ కేంద్రాల యొక్క ముఖ్య ఉద్దేశం బాలలకు చిన్నప్పటినుండి విద్యతోపాటు సంస్కారాలు నేర్పించడం మన హిందూ సంస్కృతి గురించి చెప్పడం వీరికి ఒక్క సెంటర్ కి ఒక అధ్యాపకురాలని నియమించి వారి చేత విద్యాబుద్ధులు నేర్పడం జరుగుతుందని . అలాగే ఈ సెంటర్లు పూర్తిగా ఉచితంగా నడపబడునని, ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు ఫౌండేషన్ ద్వారాస్నాక్స్ ఇవ్వబడును అధ్యాపకురాలకు ఫౌండేషన్ వారిచే గౌరవ వేతనం ఇచ్చి నడిపించడం జరుగుతుందని అన్నారు. ప్రతిరోజు సాయంకాలం 6 గంటల నుండి ఏడు గంటల వరకు బాల బాలికలకు వివిధ రకమైనటువంటి హిందూ సాంప్రదాయ పద్ధతులను నేర్పిస్తూ, వాటితోపాటు హిందూ ధార్మిక గ్రంథాలు పురాణాలు గురించి బాల్య దశలోనే వివరించడం జరుగుతుందని అన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు




**శేరిలింగంపల్లి(మాదాపూర్), సిటిజన్ టైమ్స్, మర్చి 25**

రాష్ట్రంలో వాణిజ్య సిలిండర్ల కొరతతో హైటెక్ సిటీ లో గ్యాస్ సిలిండర్ల బ్లాక్ దందా జోరుగా నడుస్తుంది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్రిక నగర్ లో అక్రమంగా తరలిస్తున్న 31 సిలిండర్ల వ్యాన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్ ఇన్స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా సిలిండర్లను తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఘటన స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా 31 సిలిండర్లతో కూడిన ఒక వ్యాన్ ను స్వాధీనం చేసుకున్నాము అని పోలీస్ లు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి అరెస్టు చేశామని, ఇలాంటి చర్యలకు పాలుపడితే కఠినమైన చర్యలు ఉంటాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్లో విక్రయించే ప్రయత్నం ఎవరు చేసిన వెంటనే పోలీసులు దృష్టికి తీసుకురావాలని పోలీసులు సూచించారు.

# ఆత్మ చైర్మన్ చిక్కం సుధా రాణికి అభినందనలు

**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

ఉప్పలగుప్తంలో ఆత్మ చైర్మన్ గా చిక్కం సుధారాణి, ఆత్మ డైరెక్టర్లుగా మాదిరెడ్డి వెంకటరావు,కరిమెళ్ళ బాబా,పప్పుల నానాజీ ,చాట్ల మంగతాయారు, అంగాడి దుర్గ భవాని, కరాటం వాని మరి కొంతమంది ఈ రోజు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా చిందాడగరువు ఎంపీటీసీ సభ్యులు మోటూరి కనకదుర్గ వెంకటేశ్వరరావు దంపతులు వీరందరికీ సాలువ కప్పి బొకే ఇచ్చి,పూల దండలు వేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తం అవసరం

## జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎన్. పార్థసారథి








**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడం అవసరమని జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎన్.పార్థసారథి అన్నారు. ఈ సంవత్సరం జనవరి నుండి నేటి వరకు 66 అగ్ని ప్రమాదాలు జరిగాయని, నష్టం కోట్ల రూపాయల్లో వాటిలిందని అన్నారు. అగ్ని ప్రమాదాలలో రాజోలు నియోజకవర్గం ఇరుసు మండ లో జరిగిన బ్లోఅవుట్ ప్రమాదం పెద్దది అని అన్నారు.వంటలు చేసే లబ్ధిదారులు ఉదయం 9 గంటల లోపు వంటల సమయం ముగించుకోవాలని, సాయంత్రం 6 గంటల తర్వాత వంటలు చేసుకోవాలని సూచించారు. వేడిగాలి ఎక్కువగా చెవులకు తగిలితే వడదెబ్బలు కి గురికావచ్చని, ఉదయం 10:30 గంటలకు లోపు ప్రయాణాలు చేయాలని, సాయంత్రం 6 గంటల తర్వాత చల్లటి వాతావరణంలో ప్రయాణం చేయవచ్చని సూచించారు. చెత్తకుప్పలను సాయంత్రం వేళల్లో తగలబెట్టుకోవాలని, వేసవిలో కాలువలు బంద్ చేయడం వల్ల నీరు దొరకని పరిస్థితి అని తెలిపారు. ఎయిర్ కండిషన్స్( ఏసి)లు ఉదయం, సాయంత్రం వేళ్ళల్లో ఉపయోగించుకోవాలని, రిఫ్రిజిరేటర్ ఫ్రిజ్లు పేలిన సంఘటనలు ఉన్నాయని, ఫ్రిజ్లు సర్వీసింగ్ చేసుకోకపోవడం పట్ల కుండలో నైట్రోజన్ తగ్గుతుందని, అందువల్ల వేడిమికి పేలిపోవడం జరుగుతుందని అన్నారు. పలు ఆసుపత్రులు (ఇండస్ట్రీస్) పరిశ్రమలు తనిఖీలు చేస్తున్నామని, ప్రమాదాలు జరగకుండా పూర్తి ఎక్విప్మెంట్ కలిగి ఉండాలని కోరారు. రాత్రి వేళల్లో ఎలక్ట్రికల్ బైక్ లు అపార్ట్మెంట్స్ కింద రీఛార్జ్ చేసుకునేందుకు వాహనదారులు నైట్ ఆన్ చేసి వెళ్లిపోయి నిద్రస్తారని, ఎలక్ట్రికల్ వాహనాలు వేడిమికి షార్ట్ సర్క్యూట్ అయ్యి మంటలు వ్యాపిస్తే అపార్ట్మెంట్ అంతటికీ ప్రమాదకరమని, కావున అప్రమత్తంగా ఉండాలని కోరారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు స్పీడ్ (వేగం) నిర్ణయం టైర్ల పై వ్రాసి ఉంటుందని, ప్రతి ఒక్కరూ గమనించి స్పీడ్ నిర్ణయం ప్రకారం వాహనాలను నడుపుకోవాలని సూచించారు. కావున వేసవిలో డ్రైవర్స్ తో సహా ప్రతి ఒక్కరు సేఫ్టీ విషయమై అప్రమత్తంగా ఉండాలని కోరారు.

# నేర నియంత్రణే లక్ష్యం

## జిల్లా పోలీస్ సమీక్షా సమావేశంలో ఎస్పీ రాహుల్ మీన





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఏలూరు రేంజ్ ఐజి జి.వి.జి. అశోక్ కుమార్ ఐపిఎస్ జూమ్ ద్వారా హాజరై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐజి జి వి జి అశోక్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పాత నేరస్థులు మరియు రౌడీ షీటర్ల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే వారిపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన చోట పీడీ యాక్ట్ ప్రయోగించడంతో పాటు జిల్లా బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**అంబేద్కర్ జయంతి వేడుకలకు పటిష్ట భద్రత:**

వచ్చే నెల ఏప్రిల్ 14న నిర్వహించనున్న డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయాలని, సోషల్ మీడియా వదంతులపై నిఘా ఉంచాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, ముఖ్యంగా తీవ్రమైన నేరాలు మిస్సింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు సీఐలు ఎస్హెచ్ఓలు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా ఎస్పీ జిల్లాలోని శాంతిభద్రతలు నేర గణాంకాలను నెట్వర్క్ ఆధారంగా క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సమావేశంలో సి సి టి ఎన్ ఎస్ అప్డేషన్, 112 అత్యవసర స్పందన సమయం, ఈ-సాక్ష్య పనితీరు, మరియు డ్రోన్ల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలని,అవసరమైన చోట పీడీ యాక్ట్ బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై విశ్లేషణ జరిపి, బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై నిరంతరం నిఘా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్, అమలాపురం డిఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ , కొత్తపేట డిఎస్పీ మురళి మోహన్, ఏఆర్ డిఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సిఐ పుల్లారావు, డీసీఆర్బీ సిఐ నాగ ప్రసాద్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నృసింహుని మాజీమంత్రి సినీనటి రోజా...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 25**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని మాజీ మంత్రి, సినీనటి ఆర్ కే రోజ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం అర్చకస్వాములు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్య లక్ష్మీ అమ్మవారికి కుంకుమ పూజలు చేసి, వేద పండితులచే వేదాశిర్వాదం అందించారు. ఆలయ పరివేక్షకులు విజయసారధి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ...





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, మార్చి 25**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు మహాజన సభ సంఘ చైర్మన్ రావూరి నాగరాజు (నాగు) అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుచూ సంఘం నందు జరుగు కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, కొత్త లోన్స్ ఇవ్వడపై చర్చించి, నిర్ణయం తీసుకోవాలని ఆయన తెలిపారు. ఈ మహా జనసభలో త్రిమెన్ కమిటి మెంబెర్ పొన్నమండ కనకరావు, సంఘ సీఈఓ పినపోతు ప్రభాకరరావు, అంతర్వేది దేవస్థానం సర్పంచ్ కొండా జాన్, అంతర్వేది కర ఎంపీటీసీ చొప్పల బాబూరావు, మాజీ సంఘ చైర్మన్ లు బెల్లంకొండ యేసుబాబు, అన్నాబత్తుల హనుమంతరావు, దూది త్రినాథ్, మాజీ సంఘ డైరెక్టర్ ఆచంట రాంబాబు, గొంది మాజీ ఎంపీటీసీ కొక్కిరిగడ్డ శ్రీనివాసు, గొంది నీటి సంఘ వైస్ చైర్మన్ గేదెల తిరపతి, అయినపర్తి వీరస్వామి, జనసేన పార్టీ గ్రామ శాఖ లు కొల్లు వెంకట్రాజు, దంగేటి బాబి, గొంది టీడీపీ మాజీ గ్రామశాఖ అధ్యక్షులు ఇల్లింగి వేణు గోపాల్, కూటమి నాయకులు, సంఘ సభ్యులు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# పాలగుమ్మి గ్రామాభివృద్ధికి ప్రాధాన్యత

**ఒకేరోజు నాలుగు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**

**చెంతనే వైద్యం, రైతు సేవలు అందాలనేదే ప్రభుత్వ సంకల్పం - పాలగుమ్మిలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ప్రారంభం..**

**గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం-పాలగుమ్మిలో సిసి రోడ్డు ప్రారంభోత్సవం**



**అమలాపురం రూరల్ సిటిజన్ టైమ్స్ మార్చి 25**

నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే మన ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మి గ్రామంలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డుతో పాటు పంచాయతీ కార్యాలయ భవనం, రైతు సేవా కేంద్రం మరియు విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) భవనాలను ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను నేడు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలతో పాటు, చెంతనే వైద్యం మరియు రైతు సేవలు అందాలనే ఆలోచనతో ఈ భవనాలను నిర్మించినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రం ద్వారా సాగు సలహాలు, ఆరోగ్య క్లినిక్ ద్వారా ప్రాథమిక చికిత్సలు గ్రామంలోనే లభిస్తాయని, తద్వారా ప్రజలకు సమయం మరియు ఖర్చు ఆదా అవుతాయని వివరించారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించే వరకు విశ్రమించబోమని ఎమ్మెల్యే ఆనందరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, పార్టీ నాయకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరా సమన్వయ అధికారిగా అడపా ఉదయభాస్కర్

## జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి





**అమలాపురం,సిటిజన్ టైమ్స్ మార్చి 25**

ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలను నేపథ్యంలో ఎల్పి జి గ్యాస్ తక్కువగా లభ్యం అవుతున్న పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా పైపుల ద్వారా నేరుగా గ్యాస్ ఇంటికి వచ్చే విధానాన్ని ప్రోత్సాహించాలని, జిల్లాలో ఇప్పటికే వున్న గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి పైప్ లైన్ గ్యాస్ సరఫరా వ్యవస్థను మరింతగా విస్తృతము, పటిష్ఠము చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ .నిశాంతి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జీవో నెంబర్ 8 ప్రకారం నియమితమైన జిల్లా స్థాయి యుటిలిటీ కమిటీ సభ్యులతో గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పైప్‌లైన్ గ్యాస్ సరఫరా విధి విధానాలు ప్రయోజనాల గురించి జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన సమీక్షించారు.జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ భాస్కర్ సమన్వయ అధికారిగా నియమింపబడ్డారని, అన్ని శాఖలను సమన్వయ పరిచి ఈ ప్రభుత్వ ఆదేశాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ముందుగా గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ దుర్గ మాట్లాడుతూ కనెక్షన్ పొందే విధానం,దరఖాస్తు సమర్పించాల్సిన పత్రాలు తదుపరి సర్వే కంపెనీ ప్రతినిధులు ఆ ఇంటిని సందర్శించి పైప్‌లైన్ వేయడానికి వీలవుతుందో లేదో సర్వే చేస్తారన్నారు.సరఫరా మౌలిక సదుపాయాలు, ఇంటి వెలుపల ఒక గ్యాస్ మీటర్ అమర్చబడుతుందనీ,ఎంత గ్యాస్ ఉపయోగిస్తారో దానికి మాత్రమే బిల్లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పటిష్టమైన పైపుల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు.సిలిండర్ల మాదిరిగా అయిపోతుందనే భయం ఉండదని 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. సిలిండర్ తో పోలిస్తే పైప్ లైన్ గ్యాస్ చాలా సురక్షితమన్నారు. గ్యాస్ లీక్ అయిన గాలి కంటే తేలికగా ఉండటం వల్ల త్వరగా గాలిలోనికి కలిసి పోవడం వల్ల పెద్దగా ప్రమాదం ఉండదన్నారు.సాధారణ ఎల్పిజి సిలిండర్ల కంటే ఇది సుమారు 20% నుండి 30% వరకు తక్కువ ధరకు లభిస్తుందన్నారు సిలిండర్ బుకింగ్ చేసుకోవడం,వచ్చే వరకు వేచి చూడటం వంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి మీటర్ రీడింగ్ ఆధారంగా బిల్లు వస్తుందన్నారు. పైప్‌లై న్‌ల ద్వారా గ్యాస్‌ను సరఫరా చేయడం సురక్షితమని నిర్విరామంగా సరఫరాను అందిస్తుందన్నారు.అగ్ని ప్రమాదాలు లీకేజీలు ఉండమన్నారు. గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రభుత్వం ఆమోదంతో గ్యాస్ పైప్‌లైన్‌లు వేస్తుందన్నారు. పర్యావరణ శుభ్రమైన చవకైన ఇంధనం అన్నారు. కోనసీమ జిల్లా అల్లవరం మండలం గుడాల ఓఎన్జిసి గెయిల్ స్టేషన్ ఉందన్నారు. జీవో నెంబర్ 8 ప్రకారం నిర్దే శిత గడువులలో అనుమతులు ఇవ్వాలన్నారు.అండర్ గ్రౌండ్ పైపు లైన్లు ఏర్పాట్లు ఆర్ అండ్ బి పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్ విభాగాలు సహకరించాలన్నారు.జిల్లా వ్యాప్తంగా 13 వేల కనెక్షన్లకు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని ఇప్పటికీ 1000 కనెక్షన్లు పనిచేస్తున్నాయని తెలిపారు. టిడ్కో గృహ సముదాయాలు, అపార్ట్మెం ట్లలో ఈ పైప్ లైన్ గ్యాస్ సరఫరా వ్యవస్థను పటిష్టంగా అమలు చేయా లన్నారు. మున్సిపల్ కమిషనర్లు వారి వారి పరిధిలో పైప్ లైన్ గ్యాస్ వ్యవస్థ వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చేందుకు అవగాహన సదస్సులను నిర్వహించి ఎల్పిజి కి ప్రత్యామ్నాయంగా సిఎన్జి గ్యాస్ వినియోగంపై దృష్టి పెట్టాలన్నారు.ప్రభుత్వ ఆదేశాలకు అను గుణంగా జిల్లా స్థాయి యుటిలిటీ కమిటీ సభ్యులు ముఖ్యమైన పాత్ర పోషించి ప్రత్యా మ్నాయ ఏర్పాట్లు ద్వారా ఎల్పిజి గ్యాస్ కొరతను అధిగమించాలని ఆమె స్పష్టం చేశారు. కమిటీ సభ్యులైన అధికారులు ముఖ్యం గా హోటల్స్ కేటరింగ్ వంటి వ్యాపార సంస్థలకు అన్నదానం జరిపే దేవాలయాలకు ఈ కనెక్షన్ ఇవ్వాలని అవసరమైతే కొత్త లైన్లు నిర్మించడానికి సత్వరమే అనుమతులు జారీ అయ్యేలాగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పౌర సరఫ రాల అధికారి ఏ. ఉదయ భాస్కర్, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షకు ఇంజనీర్ బి రాజేశ్వరి,ఆర్ అండ్ బి ఎస్.ఈ బి.రాము, పంచాయతీ రాజ్ డివిజనల్ ఇంజనీర్ అన్యం రాంబాబు, మున్సిపల్ కమిషనర్లు రాజు, వి.నిర్మల్ కుమార్ ,డిపిఓ శాంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ శాఖ నాల్గోవ తరగతి ఉద్యోగులకు యూనిఫామ్ అందజేసిన డీఆర్ఓ డా.టి.తిప్పేనాయక్



**కాకినాడ బ్యూరో ఇన్చార్జ్ సిటిజెన్ టైమ్స్ మార్చ్ 25**

కాకినాడ కలెక్టరేట్ యూనిట్ రెవెన్యూ శాఖలో నాల్గోవ తరగతి ఉద్యోగులకు బుధవారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్ చేతుల మీదుగా యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్ఓ తిప్పేనాయక్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏటా రెవెన్యూ శాఖలో కాకినాడ కలెక్టరేట్ యూనిట్ కింద పని చేస్తున్న నాల్గోవ తరగతి ఉద్యోగులకు యూనిఫామ్ అందజేయడం జరిగిందన్నారు. పౌరసరఫరాల, కలెక్టరేట్, వివిధ అధికారుల బంగ్లాలలో పనిచేస్తున్న మొత్తం 81 మంది నాలుగో తరగతి ఉద్యోగులకు రెండు జతల చొప్పున యూనిఫారం అందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా డీఆర్ఓ తిప్పేనాయక్ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.రామ్మోహన్ రావు, నాల్గవ తరగతి ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన మంత్రి




**నూజివీడు ( సిటిజన్ టైమ్స్) మార్చి:25**

ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం తింటూ విద్యార్థులతో మాట్లాడి, భోజనం నాణ్యత, పాఠశాలలో బోధన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యార్థులు సంతృప్తికరంగా భోజనం చేయాలని, నాణ్యతలో చిన్న లోపం ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డొక్కా సీతమ్మ పేరుతో కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.

# డీజిల్ పెట్రోల్‌కి ఏ విధమైన కొరత లేదు

## అడపా ఉదయ భాస్కర్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 25**



రాష్ట్రవ్యాప్తంగా గాని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా గాని ఎక్కడా కూడా పెట్రోలు డీజిల్ కి ఏవిధమైన కొరత లేదని గ్యాస్ సరఫరా సమన్వయ అధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. గతంలో మన జిల్లా వినియోగం ఎంతయితే ఉందో అంత పెట్రోలు డీజీలు స్టాకులు మన బంకులకి వస్తున్నాయని జిల్లా పౌరసరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ తెలియజేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆధారపడి ఎవరూ కూడా కంగారు పడవద్దని, కంగారుపడి ఎక్కువ ఆయిల్ తీసుకొని కృత్రిమ కొరత సృష్టించవద్దని కోరుతున్నారు. ఈ వదంతులను నమ్మి చాలా మంది పెద్ద పెద్ద క్యాన్లలో బాటిల్స్ లో పెట్రోల్ పోయమని బంకులకి వస్తున్నారు కానీ పిసో నిబంధనల ప్రకారం ఆ విధమైన పద్ధతిలో పోయడం చట్టవిరుదం అని తెలిపారు. నేరుగా వాహనాల్లోకి మాత్రమే పెట్రోల్ గానీ డీజిల్ గాని పోయాలని పేర్కొన్నారు. వినియోగదారులు ఎవరు దయచేసి కంగారుపడి వ్యవస్థను అస్తవ్యస్తము చేయవద్దు అని సూచించారు. బంకు యజమానులు కూడా ప్రజల్లో ఉన్న భయాందోళనలు తొలగించాలని,బల్క్ పాత్రల్లో పెట్రోల్ పోయడం నిలిపివేయాలని పేర్కొన్నారు. ఈ విధమైన చర్యలకు పాల్పడితే బంకులపై తీవ్రమైన చర్య తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

# ఏప్రిల్ 6 ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరపాలి -బిజెపి శ్రేణులు





**అమలాపురం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

పట్టణం బీజేపీ ప్రశిక్షణా కార్యక్రమం బుధవారం స్థానిక కిరాణా మర్చంట్ హాల్ లో పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశం జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిలుగా జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1951 వ సంవత్సరంలో భారతీయ జనసంఘ్ పార్టీ గా మొదట శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారని, అనంతరం జరిగిన పరిణామాలలో 1980, ఏప్రిల్ 6 వ తేదీన భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందని అన్నారు.1990 సంవత్సరం నుండి బలమైన రాజకీయ శక్తిగా ఎదిగి అటల్ బిహారీ వాజ్పేయి నేతృత్వంలో మొదటి సారి 1996 లో మొదటిసారి అధికారం లోకి వచ్చి 13 రోజులు అల్పకాలిక ప్రభుత్వం ఏర్పాటు చేశాక 1998 లో 13 నెలలు, 1999 లో జరిగిన ఎన్నికలలో ఎన్డీయే కూటమి ద్వారా పూర్తి కాలం ప్రభుత్వాన్ని నడిపారన్నారు. అనంతరం 2014 లో నరేంద్ర మోడీ నాయకత్వం లో పూర్తి స్థాయి అధికారం లోకి వచ్చిందన్నారు.అనంతరం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశామన్నారు.కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి,వాటిని ప్రజల లోకి తీసుకెళ్లాలన్నారు. ఏప్రిల్ 6 న జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరపాలని,ఏప్రిల్ 14 న జరిగే రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సోషల్ మీడియా ప్రాధాన్యత గురించి వివరించి సోషల్ మీడియా ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాన్నారు.ఆపరేషన్ సింధూర్ ద్వారా పాకిస్తాన్ కుట్రలను తిప్పికొట్టిన విషయం గురించి తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అమెరికా, ఇజ్రాయిల్- ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి ద్వారా మన దేశానికి గ్యాస్, చమురులను రప్పిస్తున్న నరేంద్ర మోదీ చతురత గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకరమిల్లి శ్రీనివాసరావు,సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, చిలకమర్రి కస్తూరి, మాలే శ్రీనివాస్ నగేశ్, మాజీ పార్లమెంట్ కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షులు సంషూ సాద్విక్ , జిల్లా అధికార ప్రతినిధి అరిగెల పుల్లయ్య నాయుడు, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, జిల్లా కార్యాలయ ఇంచార్జి డీవీఎస్ రాజు, చిట్టూరి రాజేశ్వరి, గోకరకొండ గంగన్న స్వామి, కొండేటి జయలక్ష్మి, పావులూరి వెంకట్, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ కేశవ స్వామి కళ్యాణ మహోత్సవ రాట ముహూర్తం



**ఆత్రేయపురం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

మండలం లోని ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానం నందు శ్రీ జగన్మోహిని కేశవ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవములు సందర్భంగా రాట ముహూర్తం జరిగింది.

# 2025-26 రబీ సీజనులో ధాన్యం సేకరణకు అధికారులు సన్నద్ధం కావాలి

## ఏప్రిల్ 1నుంచి జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభం

## ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలి -జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్





**కాకినాడ సిటిజన్ టైమ్స్ మార్చి 25**

రబీ 2025-26 సీజనులో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించడం జరుగుతుందని, ఈ ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ధాన్యం కనుగోలు కమిటీ సమావేశాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ ఎస్ మల్లిబాబు, ఎన్.శ్రీధర్ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులా నాయక్; వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్ లతో కలిసి నిర్వహించారు. సహకార, లీగల్ మెట్రాలజీ, ట్రాన్స్ పోర్ట్, కార్మిక, మార్కెటింగ్, ఎఫ్సీఐ శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో 2025-26 రబీ సీజన్ లో కాకినాడ, పెద్దాపురం డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ప్రణాళిక ప్రకారం నిర్వహించేందుకు తీసుకోవలసిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ జిల్లాలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి జిల్లాలో రబీ ధాన్యం సేకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఈ ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమయత్తం కావాలన్నారు. రబీలో ధాన్యం సేకరణకు 227 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఈ రబీ సీజన్లో మొత్తం 75197 హెక్టర్లు విస్తీర్ణంలో వరి సాగు కాగా, సుమారు 6,76,774 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కానుందని అంచనా వేయడం జరిగిందన్నారు. ఇందిలో 67,677 మెట్రిక్ టన్నులు ధాన్యం స్థానిక వినియోగానికి పోను 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్లోకి రానుందని జేసీ తెలిపారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సాంకేతిక నిపుణులు, డేటా ఎంట్రీ అపరేటర్లను నియమించడం జరిగిందన్నారు. సిబ్బంది అందరికీ ధాన్యం సేకరణ ప్రక్రియపై అవగాహన కల్పించాలన్నారు. రబీ సీజనులో రాష్ట్ర ప్రభుత్వం సాధారణ రకం క్వింటాకు రూ.2,369; ఏ గ్రేడ్ కు రూ.2,389 మద్దతు ధరగా ప్రకటించిం దన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువగా రైతులు ఎవరు ధాన్యం అమ్ముకోకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంతా ఆన్ లైన్ లో జరుగుతుందని, మధ్యవర్తులు దళారుల బారినబడి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ప్రధానంగా ధాన్యం రైతులను దగ్గర నుంచి రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియలో అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులను రైతు సేవ కేంద్రాల్లో తగినన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో తగిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని, తేమశాతం ఇతర యంత్ర పరికరాలు పనితీరును మరోసారి పునఃపరిశీలన చేయాలని జేసీ అధికారులు ఆదేశించారు. జిల్లాలోని రైస్ మిల్లులు బ్యాంకు గ్యారంటీలు సమర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. తనికుల కొలతలు అధికారులు విధిగా జిల్లాలోని వే బ్రిడ్జిలు అన్నిటిని క్షుణంగా తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. రైతులకు తార్పలిన్లు పంపిణీ చేసేందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. రబీ సీజను ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ విజయ వంతంగా నిర్వహించేం దుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జేసీ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఆర్ఎస్ఎస్ సత్యనారాయణ రాజు, డీటీసీ ఎన్.శ్రీధర్, లీగల్ మెట్రాలజీ డీసీ జనార్ధన్, ఎఫ్సీఐ మేనేజర్ సిహెచ్ గంగాధర్, సహకార, మార్కెటింగ్ శాఖల అధికారులు, వ్యవసాయ శాఖ ఏడీఏలు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

**అల్లవరం సిటిజన్ టైమ్స్ మార్చి 25**

తాడేపల్లి లోని వైఎస్ఆర్సిపి పార్టీ క్యాంప్ కార్యాలయం నందు వైఎస్ఆర్సిపి పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగిందని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైఎస్ఆర్ సీపీ నాయకులు అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలపై పార్టీ తరపున పోరాడాలని తెలియజేశారు. ప్రజా సమస్యలపై తనదైన శైలిలో పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ని అభినందించడం జరిగింది.



## 'ఎర్త్ అవర్'లో భాగంగా స్వచ్ఛందంగా విద్యుత్ లైట్లు ఆఫ్ చేయాలని ప్రజలకు పిలుపు"

**జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత గా భావించాలి.**

**- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే "ఎర్త్ అవర్ 2026" కార్యక్రమంలో భాగంగా మార్చి 28 శనివారం రాత్రి 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు అవసరం లేని విద్యుత్ దీపాలను స్వచ్ఛందంగా ఆఫ్ చేసే కార్యక్రమంలో స్వచ్ఛందంగా నగర ప్రజలందరూ పాల్గొనాలని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. 2007లో వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్- ఇండియా సంస్థ ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 190కి పైగా దేశాలు ,ప్రాంతాలలో నిర్వహించబడుతున్న అతిపెద్ద పర్యావరణ ఉద్యమంగా మారిందని తెలిపారు. ఈ సంవత్సరం ఎర్త్ అవర్‌కు 20 సంవత్సరాలు పూర్తి కావడం ఒక విశేషం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యుత్ ఆదా, వాతావరణ మార్పులపై అవగాహన, జీవ వైవిధ్య పరిరక్షణ మరియు పర్యావరణ సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందుతుందని తెలిపారు. జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు,గృహాలలోని ప్రజలు ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛందంగా పాల్గొని విద్యుత్ లైట్లను ఆఫ్ చేయాలని కమిషనర్ సూచించారు. అలాగే నివాసిత సంక్షేమ సంఘాలు, యువత, సామాజిక , స్వచ్ఛంద సంస్థలు అందరూ కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "భవిష్యత్ తరాల కోసం మన భూమిని కాపాడటంలో భాగంగా ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని జీవీఎంసీ కమిషనర్ పేర్కొన్నారు.

## విశాఖ తీరంలో సరికొత్త కాఫీ రుచులు: "సన్ కేఫ్"ను ప్రారంభించిన సీపీ





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

నగరంలోని సాగర తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో, అత్యాధునిక హంగులతో సరికొత్త కాఫీ రుచులను పరిచయం చేస్తూ "సన్ కేఫ్" తన కార్యకలాపాలను ప్రారంభించింది. బీచ్ రోడ్ సమీపంలోని పాండురంగాపురంలో ఏర్పాటు చేసిన ఈ రెస్టారెంట్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అంతకుముందు కేఫ్ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

**అరకు కాఫీ రైతులకు అండగా ఉండటమే మా లక్ష్యం: డాక్టర్ శృతి.**

ఈ సందర్భంగా కేఫ్ అధినేత డాక్టర్ శృతి మాట్లాడుతూ, కోస్టల్ బెల్ట్ ప్రాంతంలో కాఫీ సంస్కృతిని మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఈ కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా విశాఖ గిరిజన ప్రాంతమైన అరకు కాఫీ రైతులను ప్రోత్సహించడమే తమ ప్రధాన ఉద్దేశ్యమని ఆమె స్పష్టం చేశారు. స్థానిక రైతులకు మద్దతుగా నిలుస్తూనే, నాణ్యమైన కాఫీని వినియోగదారులకు అందిస్తామన్నారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా "సన్ కేఫ్" ఫ్రాంచైజీలను విస్తరించే ప్రణాళికలో ఉన్నామని ఆమె వెల్లడించారు. ఆహ్లాదకరమైన వేదిక: సీపీ ప్రశంసలు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ.. నగర వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో కాఫీ తాగుతూ సేద తీరడానికి సన్ కేఫ్ ఒక కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందని ఆకాంక్షించారు. కొత్త రుచులను పరిచయం చేయడంతో పాటు, స్థానిక రైతాంగానికి అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కందుల నాగరాజు, జనసేన పార్టీ నాయకులు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, ఇతర ప్రముఖులు మరియు కేఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సులో దొరికిన బంగారాన్ని పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ సిబ్బంది

## ప్రశంసతో పాటు సన్మానించిన పోలీసులు






**గుడ్లూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు మరచిన బంగారాన్ని ఆ బస్సు కండక్టర్, డ్రైవర్ పోలీసులకు అప్పగించిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుడ్లూరుకు చెందిన దేవరకొండ వెంకాయమ్మ తన యొక్క బంగారు బ్రాస్లెట్ ను మాచవరం బ్యాంకులో తనకాపెట్టి డబ్బులు తీసుకొనుట కొరకు వెళ్లగా, బ్యాంక్ లో పని అవ్వకపోవడంతో, తిరిగి గుడ్లూరు రావడానికి కందుకూరు డిపోకు చెందిన ఏపీ 27 టీజడ్ 0808 అను బస్సులో ఎక్కి తన యొక్క గోల్డ్ ను బస్సులో మర్చిపోయి గుడ్లూరులో దిగినది. దిగిన తర్వాత బస్సులో గోల్డ్ మర్చిపోయాను అన్న విషయం గుర్తుకు రావడంతో స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేయగా, వెంటనే స్పందించిన పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బంది ఉషారాణి, లక్ష్మణస్వామి, డ్రైవర్ సురేంద్రలు వెంటనే ఎస్ఐ వెంకట్రావుకు సమాచారం చేరవేశారు. వెంటనే ఎస్సై బస్సు కండక్టర్ ని కాంటాక్ట్ అవ్వగా ఈలోపు బస్సు కండక్టర్ సీటులో ఉన్న బ్రాస్లెట్ చూసి తన వద్ద ఉంచుకొని, వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ సమయంలో బస్సు కండక్టర్ నిజాయితీగా గోల్డ్ తీసుకొని గుడ్లూరు పోలీస్ స్టేషన్ కు వచ్చి బాధిత మహిళ దేవరకొండ వెంకాయమ్మకు అందించాడు. దీనితో తను బస్సులో పోగొట్టుకున్న గోల్డ్ ను అందుకున్న వెంకాయమ్మ, ఆమె కుటుంబ సభ్యులు బస్సు కండక్టర్ చంద్రమోహన్ రావుకు, డ్రైవర్ కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సంఘటనలో బస్సు కండక్టర్ చంద్రమోహన్ రావు మరియు డ్రైవర్ నిజాయితీగా గోల్డును తీసుకొని వచ్చినందుకు వారికి స్థానిక ఎస్సై వెంకట్రావు శాలువాతో సత్కరించి, ప్రశంశను అందజేశారు.

# వైభవంగా అర్చక పురోహితులకు పంచాంగాల పుస్తకాల పంపిణీ



### సేవా కార్యక్రమంలో సాయి మనోజ్



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

నూతన (పరాభవ నామ) సంవత్సర సందర్భంగా కనిగిరి లోని స్థానిక బ్రాహ్మణ కళ్యాణ మండపంలో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా పంచాంగ పుస్తకాల పంపిణీ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. 'పరాభవ' నామ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని, కనిగిరి నియోజకవర్గానికి చెందిన జాతీయ యువజన కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.సంగరాజు సాయి మనోజ్ జాతీయ స్థాయి పదవిని చేపట్టిన తర్వాత తొలిసారి వచ్చిన సందర్భంగా, కనిగిరి ప్రాంతంలోని అర్చక పురోహితులందరికీ నూతన సంవత్సర పంచాంగాలను అందజేశారు. కేవలం పంచాంగాలే కాకుండా, కంచి కామకోటి పీఠాధిపతులు జగద్గురు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారి ప్రత్యేక అనుగ్రహంతో పొందిన ఆధ్యాత్మిక పత్రాలను కూడా స్వామివారి ఆశీస్సులతో పురోహితులకు పంపిణీ చేయడం విశేషం.ఈ సందర్భంగా ప్రముఖ వేద పండితులు వినుపాముల రామకృష్ణ శర్మ ,సాయి మనోజ్ ను వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా సత్కరించి, ఆశీర్వచనాలు అందజేశారు. యువకుడైన మనోజ్ జాతీయ స్థాయిలో కీలక పదవిని పొందడం పట్ల కనిగిరి అర్చక సంఘం హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనను ఆశీర్వదించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.?ముఖ్యఅతిథులుగా ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కళ్యాణ మండపం చైర్మన్ ధూళిపాళ్ల వీరభద్రరావు, శానికొమ్ము జగన్ మోహన్ రెడ్డి, శివాలయం డైరెక్టర్ సూరపరాజు తులసి, మరియు పెద్ద సంఖ్యలో అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు. బ్రాహ్మణ సమాజ సంక్షేమానికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సాయి మనోజ్ చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమం కనిగిరి బ్రాహ్మణ సేవా సంఘం మరియు స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంది.ఈ కార్యక్రమం లో అర్చకులు పురోహితులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణస్వామి హుండీల ఆదాయం రూ.5,07,617/-



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం లో బుధవారం కందుకూరు డివిజన్ ఇన్స్పెక్టర్ జి ఏ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో హుండీలు లెక్కించగా ఆదాయం 5 లక్షల 7 వేల 617 రూపాయలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క నెల ఏడు రోజులకు సంబంధించిన హుండీలు లెక్కించగా మెయిన్ హుండీల ద్వారా రూ.4,41,533/- లు, అన్నదానం హుండీల ద్వారా రూ.66,084/- లు వచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఉచిత సేవాదారులు పాల్గొన్నారు.

## పొదిలిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభం



**పొదిలి, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

పొదిలిలో పొగాకు వేలం కేంద్రం ప్రారంభమైంది. బుధవారం నాడు పొగాకు వేలం కేంద్రాన్ని గుంటూరు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. విశ్వ శ్రీ లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాలను నిర్వర్తించిన ఆమె వేలం కేంద్రంలో పాల్గొని పొగాకు విక్రయాల ను పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వశ్రీ మాట్లాడుతూ ఈ ఏడాది నాణ్యమైన పొగాకు దిగుబడి వచ్చిందని, అందువల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశాలు ఉన్నట్లు ఆమె చెప్పారు. కాగా ప్రారంభంలోనే నాణ్యమైన పంట కిలో 28 రూపాయలతో ప్రారంభం కాగా 25 రూపాయల ధర పలకడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలోనే ధరలు ఆశాజనకంగా లేవని రైతులు పెదవి విరిచారు. ఈ కార్యక్రమంలో పొదిలి పొగాకు వేలం నిర్వహణ అధికారి తో పాటు సిబ్బంది , వివిధ కంపెనీలకు చెందిన బయ్యర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం

### ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి





**పొదిలి, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

ప్రయాణికులకు అన్ని విధాల మెరుగైన సేవలు అందించడమే తమ సంస్థ ప్రధాన లక్షమని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి చెప్పారు. బుధవారం నాడు పొదిలి పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో కె విజయ భాస్కర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్. ఓ వాటర్ ప్లాంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థకు ప్రయాణికులే అతి ప్రధానమైన వ్యక్తులుగా ఆయన అభివర్ణించారు. అందువల్ల ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సురేష్ రెడ్డి చెప్పారు. దాతల సహకారంతో ప్రతి ఆర్టీసీ బస్ స్టేషన్ లో ఆర్. ఓ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని లక్ష్యంతో కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. శ్రీ శక్తి పథకం వల్ల మహిళల రద్దీ పెరిగిందని, అయితే అందుకు అనుగుణంగా బస్సులను కూడా పెంచేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని సురేష్ రెడ్డి చెప్పారు. ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణాలు సాగించడం ద్వారా సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ వి. శంకరరావు, బిజెపి నాయకులు బెల్లంకొండ విజయలక్ష్మి, సయ్యద్ ఖాదర్ భాష, డి రమణారెడ్డి, ఎస్ కె భాష తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఒక్కరు చట్టాలకు లోబడి ప్రవర్తించాలి




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, మార్చి 25**

ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ షేక్. ఇబ్రహీం షరీఫ్ బుధవారం గిద్దలూరు సబ్ జైలు ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైల్ లో ఉన్న ప్రతి ఒక్కరి కేసుల వివరములను అడిగి తెలుసుకున్నారు . ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ప్రవర్తించాలన్నారు. బెయిల్ పొందిన తర్వాత, విడుదల అయిన విచారణ ఖైదీలు, సదరు కేసు పూర్తయ్యే వరకు, ప్రతి వాయిదాకు కోర్టు ముందు తప్పక హాజరు కావాలన్నారు.నేర ప్రవృత్తి ని విడిచిపెట్టి , బాధ్యత కలిగిన మంచి పౌరులుగా మెలగాలన్నారు. మద్యం త్రాగి వాహనాలు నడపటం నేరమన్నారు. మంచి మార్పు రావటం కోసమే , చట్ట విరుద్ధముగా ప్రవర్తించినవారిని జైల్లో ఉంచుతారన్నారు .అరెస్ట్, బెయిల్,సింగిల్ స్యూరిటి, ఉచిత న్యాయ సహాయం గురించి తెలియజేశారు . ఆర్థిక స్తోమత లేని వారికి, వారి కేసులను పూర్తి చేయడానికి, మండల న్యాయ సేవాధికారి సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని పొందవచ్చు అన్నారు. ఖైదీలకు అందిస్తున్న సదుపాయాలను, ఆహార పదార్థములను, సరుకుల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ. ఓంకార్ , గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భరత్ చంద్ర, లీగల్ ఎయిడ్ న్యాయవాది బి. రాజ్ కుమార్ నాయక్ ,పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు, సబ్ జైల్ సూపర్డెంట్ యూ. లింగారెడ్డి, సబ్ జైల్ సిబ్బంది, విచారణ ఖైదీలు పాల్గొన్నారు.

# మొత్తానికి సమంతకు ఆ ఛాన్స్ సమీపిస్తోందా?



**శృతి హాసన్ యొక్క భీకరమైన బ్రౌన్ గౌన్ గ్లో: బ్యాక్ ఇన్ యాక్షన్**



దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా తనదైన ముద్ర వేసిన సమంత బాలీవుడ్ వెండితెర ఎంట్రీ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తోన్న సంగతి తెలిసిందే. ది ఫ్యామిలీ మ్యాన్ 2, సిటాడెల్: హనీ బన్నీ వంటి వెబ్ సిరీస్‌లతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సత్తా చాటినా? అది బుల్లి తెర కావడంతో? అమ్మడు సంతృప్తి చెందలేదు . ఒక భారీ హిందీ సినిమా ద్వారా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించాలనే ప్రయత్నాలు చేస్తున్నా? సరైన ఛాన్సులు రాకపోవడంతో నీరిక్షణ తప్పలేదు. తాజాగా సామ్ వెండి తెర ఎంట్రీకి సమయం ఆసన్నమైంది. బాలీవుడ్ అగ్ర నిర్మాత కరణ్ జోహార్ నిర్మాణంలో సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందున్న కొత్త సినిమాలో సమంతను హీరోయిన్‌గా పరిశీలిస్తున్నట్లు తెలిసింది.గుంజన్ సక్సేనా: ది కార్గిల్ గర్ల్, మిస్టర్ అండ్ మిసెస్ మాహి వంటి చిత్రాలతో దర్శకుడిగా తన ప్రతిభను చాటుకున్న శరణ్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. కరణ్ జోహార్‌కు సమంతతో ఉన్న స్నేహం కారణంగా ఈ ఛాన్స్ దక్కుతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరికొన్ని రోజుల్లోనే ఛాన్స్ ఫైనల్ కానుందని సమాచారం. అదే నిజమైతే సమంత ఆనందానికి అవధులుండవ్. సమంత హిందీ సినిమాల్లో నటించాలని చాలా కాలంగా ఎదురు చూస్తోంది. మధ్యలో అనారోగ్య సమస్యలు , వ్యక్తిగత కారణాల వల్ల కొన్నాళ్లు విరామం తీసుకున్నప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు.ఇటీవలే బాలీవుడ్ దర్శక, నిర్మాత రాజ్ నిడిమోరును వివాహం చేసుకోవడం అమ్మడికి కెరీర్ పరంగానూ కొంత కలిసొచ్చిందని చెప్పొచ్చు. భర్త వైపు నుంచి కూడా కొత్త అవకాశాలు రావడానికి ఛాన్స్ ఉంది. ఇప్పటికే ముంబైలో ఖరీదైన ఇంటిని కూడా కొనుగోలు చేసిన సమంత మకాంను పూర్తిగా బాలీవుడ్‌కు మార్చే సింది. సిద్ధార్థ్ మల్హోత్రా వంటి హ్యాండ్సమ్ హీరో సరసన ఆమె జోడీ కడితే బాలీవుడ్‌లో ఒక ఫ్రెష్ అండ్ క్రేజీ కాంబినేషన్ అవుతుంద నడంలో ఎలాంటి సందేహం లేదు. శరణ్ శర్మ చిత్రాలు భావోద్వేగాలతో కూడిన కథాంశంతో ఉంటాయి. దీంతో సమంత లాంచింగ్ ఇదే పర్ఫెక్ట్ స్టోరీ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే హిందీ భాషపై అమ్మడు పట్టు సాధించింది. అక్కడి ప్రేక్షకులకు నటనతో మరింత దగ్గరవ్వాలని ఆశపడుతోంది. ధర్మ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్ లో లాంచ్ అయితే? వచ్చే గుర్తింపు కూడా ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. హబ్బీ రాజ్ నిడిమోరు సహకారం కూడా అన్ని రకాలుగా దక్కుతుంది. ఇకపై భర్త దర్శకత్వంలో కూడా సినిమాలు చేయడానికి ఛాన్స్ ఉంటుంది. బాలీవుడ్ లో రాజ్ కున్న పరిచయాలతో మరిన్ని అవకాశాలకు ఛాన్స్ ఉంటుంది. మొత్తానికి సమంత బాలీవుడ్ ఎంట్రీ ఆలస్యమైనా? స్ట్రాంగ్ గానే కనిపిస్తుందని చెప్పొచ్చు.



**మీనాక్షి చౌదరి బ్లాక్ టాప్ మరియు డెనిమ్ లుక్‌లో హల్ చల్ చేస్తుంది**

## వన్డే ప్రపంచకప్ జట్టులో టీ20 వరల్డ్ కప్ హీరోలకి నో ఛాన్స్.. ఏకంగా 8 మంది ఔట్



దక్షిణాఫ్రికా, జింబాబ్వే మరియు నమీబియా సంయుక్త వేదికలలో జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే ప్రణాళికలు సిద్ధం చేస్తుంది. 2026 టీ20 వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి ట్రోఫీ గెలిచిన జోరులో ఉన్న టీమిండియా, వన్డే జట్టులో సమూల మార్పులు చేసేందుకు రెడీ అయింది. వన్డే క్రికెట్ లో ఓపికతో పాటు ఇన్నింగ్స్‌ను నిర్మించే వారిపై బీసీసీఐ మొగ్గు చూపుతోంది.

టీ20 ప్రపంచకప్‌లో అద్భుతంగా ఆడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్ శర్మ, శివమ్ దూబే, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్ లాంటి ప్లేయర్స్ కి 2027 వన్డే జట్టులో చోటు దక్కే అవకాశం కనిపించడం లేదు. వీరందరూ కేవలం టీ20 స్పెషలిస్టులుగానే ముద్రపడటం, వన్డే ఫార్మాట్‌కు అవసరమైన నిలకడ వీరిలో లేకపోవడంతో ఈ 8 మంది ఆటగాళ్ల ఎంపికపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. కానీ, రాబోయే దేశవాళీ, ద్వైపాక్షిక సిరీస్‌లలో వీళ్లందరూ అద్భుతంగా రాణిస్తే తప్ప వన్డే జట్టులోకి పునరాగమనం చేయడం కష్టమే.

భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను రెడీ చేయాలని బీసీసీఐ సెలక్టర్లు భావిస్తున్నారు. గిల్ ఇప్పటికే తన బ్యాటింగ్, నాయకత్వ లక్షణాలతో ముందుకు నడుస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలను రాబట్టకపోయినప్పటికీ, సుదీర్ఘ కాలం పాటు జట్టును నడిపించే సామర్థ్యం అతడికి ఉందని జట్టు యాజమాన్యం నమ్ముతుంది. ఓపెనర్‌గా శుభ్‌మన్ చేసే పరుగులు జట్టుకు అత్యంత కీలకం అయ్యే ఛాన్స్ ఉంది.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్ జట్టుకు ప్లస్ కానుంది. వన్డే ఫార్మాట్లో కోహ్లీ స్థిరత్వం, రోహిత్ దూకుడు 2027లోనూ టీమిండియాకు అవసరమని క్రికెట్ పండితులు పేర్కొంటున్నారు. వీరిద్దరూ ఫిట్‌నెస్ కాపాడుకుంటే తుది జట్టులో ఉండటం పక్కా.. మరోవైపు కేఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా, జస్ప్రీత్ బుమ్రా ప్రధాన బౌలర్‌గా టీమ్ కి బ్యాక్ బోన్ లా నిలిచే అవకాశం ఉంది.

టీమిండియా 2027 వరల్డ్ కప్ జట్టు అంచనా: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా.

# 21 ఏళ్లకే క్రికెట్‌కి గుడ్ బై.. ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా ఆర్యమన్ బిర్లా.. ఎలా సాధ్యమైందంటే!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలోనే ఓ సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. క్రికెట్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన టీమ్స్ లో ఒకటైన ఆర్సీబీ జట్టు చేతులు మారింది. ఆదిత్య బిర్లా గ్రూప్ ఆధ్వర్యంలోని కన్సార్టియం సుమారు 1.78 బిలియన్ డాలర్ల (రూ.16 వేల కోట్లకు)కి ఈ ఫ్రాంచైజీని కొనుగోలు చేసింది. బ్రిటన్‌కు చెందిన డయాజియో అనుబంధ సంస్థ 'యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్' నుంచి ఆర్సీబీ 100 శాతం వాటాను ఈ కన్సార్టియం దక్కించుకుంది. ఈ భారీ ఒప్పందంతో ఐపీఎల్ జట్ల విలువ ఒక్కసారిగా భారీగా పెరిగిపోయింది. ఈ మార్పు తర్వాత ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార మంగళం బిర్లా కుమారుడు ఆర్యమన్ బిర్లా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కాగా ఆర్యమన్ బిర్లా కేవలం వ్యాపార కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినే కాదు.. అతడికి క్రికెట్‌తో సంబంధం కూడా ఉంది. మధ్యప్రదేశ్ తరపున ఫస్ట్-క్లాస్ క్రికెట్ ఆడిన అనుభవం ఆర్యమన్ కి ఉంది. ఈడెన్ గార్డెన్స్‌లో బెంగాల్ టీమ్ పై సెంచరీ చేసిన చరిత్ర అతడి పేరిట నమోదైంది. ప్రస్తుతం ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్‌తో కలిసి గతంలో అతడు డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆర్సీబీ కొత్త ఛైర్మన్ ఆర్యమన్ బిర్లా ప్రయాణం చాలా ఇంట్రెస్టింగ్ గా కొనసాగింది. 2018 ఐపీఎల్ వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడ్ని రూ.30 లక్షలకు దక్కించుకుంది. కానీ అప్పుడు ఒక్క మ్యాచ్ కూడా ఆడే ఛాన్స్ రాలేదు.. దీంతో 2020లో తీవ్ర మానసిక ఒత్తిడితో క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతం ఇస్తూ తనను తాను అర్థం చేసుకోవడానికి ఆ బ్రేక్ తీసుకున్న ఆర్యమన్ బిర్లా.. ఇప్పుడు తన తండ్రి వ్యాపార సామ్రాజ్యాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. తాజాగా ఓ ఐపీఎల్ జట్టుని కొనుగోలు చేసి అధిపతిగా తిరిగి వచ్చాడు.

ఆర్సీబీ జట్టు కొనుగోలులో ద

ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్డ్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్ పార్టనర్స్ గా ఉన్నాయి. క్రీడలు, మీడియా, వ్యాపార రంగాలలో ఉన్న అనుభవంతో ఆర్సీబీని ప్రపంచస్థాయిలో నెంబర్ వన్ గా నిలబెట్టాలని ప్లాన్ చేస్తున్నారు. ఆర్సీబీ ఎదుగుదలలో భాగస్వామి కావడం తన అదృష్టమని ఆర్యమన్ బిర్లా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలియజేశాడు.

# రియాన్ పరాగ్‌కి రాజస్థాన్ రాయల్స్ బిగ్ షాక్.. కొత్త కెప్టెన్‌గా అతడే!




ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు రాజస్థాన్ రాయల్స్ ఫ్రాంచైజీలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. 2026, మార్చి 24న ఈ జట్టు కొత్త యాజమాన్యం చేతిలోకి వెళ్లిపోయింది. ఇప్పటి వరకు మనోజ్ బదేలే నేతృత్వంలో ఉన్న ఈ ఫ్రాంచైజీని, కల్ సోమాని ఆధ్వర్యంలోని కన్సార్టియం కొనుగోలు చేసింది. గతంలో సుమారు రూ. 320 కోట్లకు కొనుగోలు చేసిన ఈ జట్టు, ఇప్పుడు ఏకంగా రూ. 15,280 కోట్లకు అమ్ముడైంది. ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన లావాదేవీలలో ఒకటిగా నిలిచింది.

**పూర్తి స్థాయి కెప్టెన్‌గా:**

యాజమాన్యంతో పాటు రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ కూడా మారారు. గత సీజన్ వరకు కెప్టెన్‌గా ఉన్న సంజూ శాంసన్, ట్రేడింగ్ ద్వారా చెన్నై సూపర్ కింగ్స్ కు వెళ్లడంతో.. రాజస్థాన్ యాజమాన్యం రియాన్ పరాగ్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. పరాగ్ గత సీజన్‌లో శాంసన్ అందుబాటులో లేనప్పుడు వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించాడు. ఈసారి పూర్తి స్థాయి కెప్టెన్‌గా వ్యవహరించబోతున్నాడు.

**జైస్వాల్ కి కెప్టెన్సీ పగ్గాలు:**

సోషల్ మీడియాలో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్‌గా రియాన్ పరాగ్‌ను తొలగించి, యశస్వి జైస్వాల్‌ను నియమించనున్నట్లు వార్త కథనాలు వస్తున్నాయి. కానీ ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు.. రాజస్థాన్ ఫ్రాంచైజీ కెప్టెన్సీ మార్పు గురించి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2026, మార్చి 25 ముంబైలో జరిగిన ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోషూట్‌లో కూడా రియాన్ పరాగ్ పాల్గొని, ట్రోఫీతో ఫోటోలకు ఫోజులిచ్చారు. అయితే జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ స్టార్ ప్లేయర్, భవిష్యత్తులో కెప్టెన్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి మాత్రం పరాగ్ కెప్టెన్‌గా కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రాజస్థాన్ ఫ్రాంచైజీ జైస్వాల్‌ను రూ. 18 కోట్లకు, పరాగ్‌ను రూ14 కోట్లకు రిటైన్ చేసుకుంది.

**రాజస్థాన్ రాయల్స్ షెడ్యూల్:**

రియాన్ పరాగ్ నేతృత్వంలోని రాజస్థాన్ రాయల్స్ తమ ఐపీఎల్ 2026 ప్రయాణాన్ని మార్చి 30న చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌తో ప్రారంభించనుంది. అనంతరం ఏప్రిల్ 4, 7, 10 తేదీలలో వరుసగా గుజరాత్ టైటాన్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లతో తలపడనుంది.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776